

మేహాద్రిలో ఆరు గేట్లలో మరమ్మతులకు గురైన ఒకటి, ఐదో గేటు

# మన రిజర్వాయర్లు భద్రమేనా..?

మేహాద్రిగెడ్డలో మరమ్మతులకు గురైన 1,5 గేట్లు

బోల్టులు ఊడి పడి కిందకు కుంగిన వైనం

- ఉమ్మడి జిల్లాలో రిజర్వాయర్ల పైనా వైసీపీ తీవ్ర నిర్లక్ష్యం
- ఐదేళ్లుగా పట్టించుకోని గత పాలకులు
- కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రూ.4కోట్లతో మరమ్మతులు
- రూ. 11.54 కోట్లతో ఐదు ప్రాజెక్టుల పనులకు ప్రతిపాదనలు


మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ గేట్లు పరిశీలిస్తున్న అధికారులు


రిజర్వాయర్ గేట్లుకు తుప్పుపట్టి కిందకు జారిన బోల్టులు

**విశాఖపట్నం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి):** తుంగభద్ర రిజర్వాయర్ గేటు ఊడిపోయిన నేపథ్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో నీటి పారుదల ప్రాజెక్టులు ఎంతవరకు సురక్షితంగా ఉన్నాయన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రాజెక్టుల నిర్వహణను గత వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేయడంతో రిజర్వాయర్లు ప్రమాదంలో పడ్డాయి. నగరానికి ఆనుకుని ఉన్న మేహాద్రిగెడ్డ, అనకాపల్లి జిల్లాలో పలు ప్రాజెక్టులకు చెందిన గేట్లు పాడయ్యాయి. మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌కు చెందిన ఒకటి, ఐదు నంబరు గేట్లు పూర్తిగా మొరాయించాయి. వరదలొచ్చినప్పుడు మేహాద్రిగెడ్డ గేట్లు పైకి లేవకపోతే పరిస్థితి ఏమిటని నీటిపారుదల శాఖ నిపుణులు ప్రశ్నిస్తున్నారు. పెద్దేరు తప్ప ఉమ్మడి జిల్లాలో గల మిగిలిన ప్రాజెక్టులు 40, 50 ఏళ్ల క్రితం నిర్మించినవి. ప్రాజెక్టు గేట్లకు గ్రీజింగ్, వెల్డింగ్, పెయింటింగ్, ఊడిపోయిన బోల్టులు, బేరింగ్‌లు, గడ్డర్లు మరమ్మతులు చేపట్టడం లేదా మార్చడం, మోటార్లు, జనరేటర్లు, ఎలక్ట్రికల్ వైరింగ్ ఎప్పటికప్పుడు పరిశీలించి అవసరమైతే మార్చాలి. నీటి ప్రవాహం నిలుపుదల చేయడానికి ఏర్పాటుచేసే స్కిన్ ప్లేట్లు మరమ్మతులు చేపట్టాలి. రిజర్వాయర్‌లో పూడిక తీయాల్సి ఉంటుంది. అయి తే 2014లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టుల మరమ్మతులకు నిధులు కేటాయించేవారు. నీరు-చెట్టు పథకంలో మంజూరుచేసిన నిధులతో కాలువల పూడికతీత, ప్రాజెక్టులకు మరమ్మతులు చేపట్టారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత గత ఐదేళ్లలో ప్రాజెక్టుల నిర్వహణకు పైసా విడుదలచేయలేదు. ప్రతి ఏటా బడ్జెట్‌లో నిధులు కేటాయించినా విడుదల చేయకుండా మొండిచేయి చూపారు.

**ప్రమాదంలో మేహాద్రిగెడ్డ**

నీటి పారుదలశాఖ నిర్వహణలో ఉన్న ... మిగతా 6వ పేజీలో

# ప్రమాదమేనా..?


మంటల్లో కాలిపోతున్న డైనో పార్కు

## కావాలనే నిప్పు అంటించారా?

డైనోపార్కు అగ్ని ప్రమాదంపై సర్వత్రా అనుమానాలు

- జీవీఎంసీ అనుమతి లేకుండా ఏర్పాటు చేసినట్టు ప్రచారం
- ఆ స్థలంపై కన్నేసిన జనసేన నేత బంధువు
- ఈ విషయమై ఇటీవల జీవీఎంసీ అధికారులతో భేటీ
- ప్రమాదం అతని పనేనని ఆరోపణలు
- నోరు మెదపని జీవీఎంసీ అధికారులు

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

బీచ్‌రోడ్డులోని డైనోపార్కులో సంభవించిన అగ్నిప్రమాదంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాదవశాత్తు జరిగిందని కొందరు చెబుతుండగా మరికొందరు ఆస్థలంపై కన్నేసిన ఓ వ్యక్తి కావాలనే నిప్పంటించారని ఆరోపిస్తున్నారు. దీనివెనుక జనసేనకు చెందిన ఓ నేత బంధువు సూత్రధారి అని అనుమానిస్తున్నారు.

బీచ్‌రోడ్డులో మత్స్యదర్శినికి సమీపంలో ఆర్కేబీచ్‌వద్ద జీవీఎంసీకి చెందిన సుమారు 2,250 గజాల ఖాళీ స్థలం ఉంది. ఆ స్థలంలో 419 గజాల స్థలాన్ని సిల్వర్‌స్పూన్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ జీవీఎంసీ నుంచి లీజుకు తీసుకుంది. బీచ్ ఫ్రంట్ అభివృద్ధి ప్రాజెక్టుకు జీవీఎంసీ ... మిగతా 6వ పేజీలో


పూర్తిగా కాలిపోయిన డైనోపార్కు, లోపలి భాగం
అగ్ని కీలల్లో డైనోపార్కు - మెయిన్ 3లో

## అనుమతుల్లేకుండానే నిర్వహణ!

- డైనోపార్కులో కానరాని అగ్నిమాపక వ్యవస్థ
- జీవీఎంసీ అనుమతులూ ప్రశ్నార్థకమే?

**విశాఖపట్నం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి):** బీచ్‌రోడ్డులో అగ్నిప్రమాదం జరిగిన డైనోపార్కు నిర్వహణకు ఎలాంటి అనుమతులు లేవని అధికారులు చెబుతున్నారు. బీచ్‌రోడ్డులో సిల్వర్‌స్పూన్ రెస్టారెంట్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థకు జీవీఎంసీ కేటాయించిన 419 గజాల్లో ప్రస్తుతం రెస్టారెంట్‌తో పాటు వినియోగదారులు కూర్చొనేందుకు వీలుగా టేబుళ్లు వేసి ఉంచారు. అయితే పక్కనే ఉన్న ఖాళీ స్థలాన్ని ఆక్రమించి ఐస్‌క్రీమ్ దుకాణంతో పాటు మంగళవారం అగ్ని ప్రమాదానికి గురైన డైనోపార్కును ఏర్పాటు చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి జీవీఎంసీ నుంచి ప్లాన్‌గానీ అనుమతిగానీ లేదని చెబుతున్నారు. పైగా డైనోపార్కులో అనేక రకాల ఆటపరికరాలు, థియేటర్లను ఏర్పాటుచేసిన నిర్వాహకులు అగ్నిప్రమాదం జరిగితే అందులో ఉన్నవారు తక్షణం బయటపడేందుకు వీలుగా మార్గాలు, మంటలను ఆర్పేందుకు వీలుగా అగ్నిమాపకపరికరాలు, ఇతర వ్యవస్థను ఏర్పాటుచేయలేదని చెబుతున్నారు. జీవీఎంసీ స్థలాన్ని ఆక్రమించి లీజు కట్టకుండానే వ్యాపారం చేస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఎవరైనా బతుకుతెరువుకోసం రోడ్డుపక్కన దుకాణం పెట్టుకుంటే పీకిపక్కనపడేసే అధికారులు అంత విశాలమైన స్థలంలో భారీ పరికరాలను ఏర్పాటుచేసి ఏళ్లుగా వ్యాపారం చేస్తున్నా ఎందుకుచర్యలు తీసుకోలేదని ప్రశ్నిస్తున్నారు. ఆ స్థలాన్ని ఎవరికైనా లీజుకిస్తే జీవీఎంసీ ఆదాయం వస్తుందని తెలిసినప్పటికీ అధికారులు కుమ్మక్కయ్యారనే దానికి ఇది ఉదాహరణ అని చెబుతున్నారు. ఉదయం వేళ ప్రమాదం జరగడంతో ప్రాణనష్టం సంభవించలేదు. అదే సాయంత్రం జరిగితే పరిస్థితి ఏమిటనేది ఊహించలేమంటున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు బీచ్‌రోడ్డులోని వ్యాపార సముదాయాలు, స్థలాల లీజుల అంశాన్ని లోతుగా పరిశీలించి, అక్రమాలకు కళ్లెం వేయాలని నగరవాసులు డిమాండ్ చేస్తున్నారు.



## నగరంలో విక్రమ్ సందడి

ప్రముఖ కథానాయకుడు విక్రమ్, హీరోయిన్ మాళవిక మంగళవారం నగరంలో సందడి చేశారు. తంగలాన్ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా సాగర్‌నగర్ సమీపంలోని రాడిసన్‌బ్లూ రిసార్ట్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. తనకు క్లిష్టమైన పాత్రలు చేయడమంటే ఎంతో ఇష్టమని విక్రమ్ తెలిపారు.

- వివరాలు I పేజీలో

## కూతురిపై దాష్టీకం

- రోటీ మేకర్ కర్రతో విచక్షణా రహితంగా దాడిచేసిన తల్లి
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాలిక


బాలిక చేతిపై గాయాలు

**పెందుర్తి, ఆగస్టు 13:** కంటికి రెప్పలా కాపాడాల్సిన కన్న కుమార్తెపై ఆ తల్లి విచక్షణారహితంగా దాడి చేసింది. దెబ్బలకు తాళలేక బాలిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు చికిత్స నిమిత్తం ఆమెను ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేశారు. విశాఖ జిల్లా పెందుర్తిలో జరిగిన ఈ దాష్టీకానికి సంబంధించి సీఐ ఎల్.రామకృష్ణ తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి.

పెందుర్తి అఖిలేశ్వరి ఆస్పత్రి సమీపంలోని అపార్టుమెంట్లో నివసిస్తున్న బి.స్వాతికి, దీపేందర్‌తో పదమూడేళ్ల కిందట వివాహమయింది. వీరికి పన్నెండేళ్ల కుమార్తె, పదేళ్ల కుమారుడు ఉన్నారు. వృత్తిరీత్యా హైదరాబాద్‌లో నివసించిన సమయంలోనే ఈ దంపతుల మధ్య మనస్పర్థలు చోటుచేసుకోవడంతో ఇటీవల విడాకులు తీసుకున్నారు. ఈక్రమంలో స్వాతి తన కుమార్తె (12)తో కలసి మూడు నెలల క్రితం పెందుర్తి వచ్చి, ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తూ స్థానికంగా నివాసం ఉంటోంది. ఈ నెల తొమ్మిదిన శ్రీకాంత్ అనే వ్యక్తిని మళ్లీ వివాహం చేసుకుంది

**ఇంటిపనులు చేయలేదని...**

కుమార్తె ఇంటి పనులు చేయలేదనే కారణంతో తల్లి స్వాతి మంగళవారం రోటీలు తయారీచేసే కర్రతో విచక్షణారహితంగా కొట్టింది. దెబ్బలకు తాళలేక కొట్టొద్దని వేడుకున్నా కనికరించలేదు. చేతులు, ముఖంపై కొట్టడంతో ఎర్రగా కంది, వాచిపోయాయి. నెమ్మదిగా ధైర్యం తెచ్చుకున్న బాలిక పరుగున పెందుర్తి పోలీసుస్టేషన్‌కు చేరుకుంది. రోదిస్తూ తన తల్లి చేసిన దాడిని వివరించింది. దీంతో పోలీసులు వెంటనే బాలికను వైద్యంకోసం ఆస్పత్రికి తరలించారు. దెబ్బలు గట్టిగా తగలడంతో ఆందోళనలో ఉందని, చికిత్స చేశామని, ప్రస్తుతం బాలిక పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. బాలిక ఫిర్యాదు ఆధారంగా తల్లి స్వాతిని స్టేషన్‌కు పిలిపించారు. అయితే ఇంటి పనుల్లో సహాయం చేయకపోవడంతో మందలించి, కొట్టానని, ఉద్దేశపూర్వకంగా కాదని తల్లి స్వాతి చెప్పినట్టు సీఐ వివరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, బాలికను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

## తహసీల్దార్ హత్యకేసులో నిందితుడి బెయిల్ రద్దు

**విశాఖపట్నం, ఆగస్టు 13:** విశాఖ రూరల్ తహసీల్దార్ హత్యకేసులో నిందితుడు ఎం.సుబ్రహ్మణ్యరంగారావు బెయిల్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ మంగళవారం రద్దుచేశారు. జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగుల జగదీశ్వరరావు తెలిపిన వివరాలివి. తహసీల్దార్ సనపల రమణయ్య హత్యకేసులో నిందితుడు ఎం.సుబ్రహ్మణ్యరంగారావుకు భీమునిపట్నం 16వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు ఈఏడాది మే 14న బెయిల్ మంజూరు చేసింది. నిందితుడు సాక్షులను ప్రభావితం చేస్తున్నాడని పీఎంపాలెం పోలీసులు జిల్లా కోర్టును ఆశ్రయించారు. నిందితుడి కాల్‌డేటా ఆధారంగా వివరాలు సమర్పించి బెయిల్ రద్దు చేయాలని కోరారు. ప్రాసిక్యూషన్ వాదనలతో ఏకీభవించిన కోర్టు నిందితుడి బెయిల్‌ను రద్దు చేసింది.





## సందడిగా హర్ ఘర్ తిరంగా

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగాలో భాగంగా మంగళవారం బీచ్‌రోడ్డులో భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ర్యాలీని ప్రారంభించారు.

# రాజకీయ విలువలకు కట్టుబడే!

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి దూరంగా కూటమి
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు


సమావేశంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

రాజకీయ విలువలకు కట్టుబడే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి నుంచి ఎవరినీ బరిలోకి దింపడం లేదని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మంగళవారం ప్రకటించారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాస్తవానికి అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు కూటమికి భారీ మెజారిటీని కట్టబెట్టారని, జిల్లాలోనే ముగ్గురు అభ్యర్థులు అత్యధిక మెజారిటీ సాధించారన్నారు. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక వచ్చిందన్నారు. రెండేళ్ల క్రితం ఈ ఎన్నిక జరిగినపుడు ప్రతి పక్ష పార్టీల నుంచి ఎవరూ బరిలో దిగకుండా, నామినేషన్లు వేయకుండా వైసీపీ భయాందోళనలకు గురిచేసిందన్నారు. అయితే అలాంటి రాజకీయాలు చేయడం సరైన విధానం కాదని అధిష్ఠానం భావించడంతో పోటీకి దూరమయ్యామన్నారు. వైసీపీకి చెందిన అనేక మంది నాయకులు కూటమిలో చేరుతామని, ఎమ్మెల్సీ అభ్యర్థిని నిలిపితే మద్దతు ఇస్తామని ముందుకు వచ్చారన్నారు. అయితే వారిని పార్టీలోకి తీసుకుని ఎమ్మెల్సీ స్థానం గెలుచుకుని సాధించేదేమీ లేదన్నారు. అయితే జిల్లాలో కూటమికి మెజారిటీ లేదనో, విజయం సాధించలేమనే భయంతోనో తీసుకున్న నిర్ణయం కాదని, ప్రజాస్వామ్యబద్ధంగా ... మిగతా 6వ పేజీలో

# అర్ధరాత్రి సర్దేశారు!

డాక్యుమెంట్లన్నీ ఆ సమయంలో పెట్టినవే

- సిబ్బందికి తెలియకుండానే రిజిస్ట్రేషన్లు
- ఇదీ భీమిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పనితీరు


భీమిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

పద్మనాభం మండలంలోని వందల కోట్ల రూపాయల విలువైన ఇనాము భూములను తప్పుడు విధానంలో రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ప్రయత్నించిన వైనం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఏకంగా 38 డాక్యుమెంట్లు పెట్టారంటే ఎన్ని ఎకరాలు కొట్టేయడానికి ప్రణాళిక రచించారో అర్థమవుతోంది. ఆ భూములను దక్కించుకోవడానికి పదేళ్లుగా ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. ఏడెనిమిదేళ్ల క్రితం కొందరు నేతలు ఈ భూముల రిజిస్ట్రేషన్‌కు ప్రయత్నించారు. అప్పటి సబ్ రిజిస్ట్రార్లు వాటిని తోసిపుచ్చారు. అవి ఇనాము భూములని, రిజిస్ట్రేషన్ చేయడం కుదరదని తేల్చి చెప్పారు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో వివాదాస్పద భూములను కొట్టేయడమే ధ్యేయంగా కొంతమంది నేతలు పనిచేయడంతో వారి దృష్టి పద్మనాభం మండలంపై పడింది. ఈ నేపథ్యంలో రవీందర్‌రెడ్డి అనే దళారి రైతుల వద్దకు వెళ్లి ఒప్పందాలు చేసుకున్నారు. రియల్ ఎస్టేట్ సంస్థలకు వాటిని రిజిస్ట్రేషన్ చేయడానికి ప్రయత్నించారు. దీని కోసం భీమిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఓ డాక్యుమెంట్ రైటర్ సాయం తీసుకున్నారు. ఆ రైటర్ ఫోర్జరీలు చేయడంలో దిట్ట. గతంలో ఓ తప్పుడు డాక్యుమెంట్ కేసులో జైలుకు వెళ్లి వచ్చారు. భీమిలికి ఏ సబ్ రిజిస్ట్రార్ వచ్చినా వారు దేనికి లొంగుతారో తెలుసుకుని, అడ్డగోలు పనులన్నీ చేయించుకోవడం అతడికి అలవాటు. తాజాగా భీమిలిలో సస్పెండైన అధికారికి అవసరమైన వన్నీ సరఫరా చేసి, పనులు చేయించుకునేవాడని ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా ఈ రైటర్ ఇటీవల బిల్డర్ అవతారం ఎత్తి సంగివలసలో భారీ అపార్ట్‌మెంట్ నిర్మాణం చేపట్టినట్టు సమాచారం.

**చీకటి పడ్డాకే పనులు**

అడ్డగోలు రిజిస్ట్రేషన్లలో ఆరితేరిన రైటర్ తన డాక్యుమెంట్లు కార్యాలయం పనివేళల్లో తీసుకురారు. చీకటి పడి, సిబ్బంది వెళ్లిపోయాక, సబ్ రిజిస్ట్రార్, ఆయనకు నమ్మకమైన ఒకరిద్దరు ఉన్నపుడు మాత్రమే తెస్తారు. అప్పుడే వాటిని స్కానింగ్ చేసి కార్యక్రమం పూర్తిచేస్తారు. అర్ధరాత్రి 12 గంటలైనా ఆ డాక్యుమెంట్ పూర్తిచేసి ఇచ్చేయాల్సిందే. అంతేకాదు అతడు ఏ డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేయిస్తున్నాడో మూడో కంటికి తెలియకుండా జాగ్రత వహిస్తారు. పద్మనాభం మండలం బి.తాళ్లవలసలో ఇనాము భూముల రిజిస్ట్రేషన్‌కు పెట్టిన 38 డాక్యుమెంట్లు కూడా సదరు రైటరు పెట్టినవేనని ... మిగతా 6వ పేజీలో

## ఏయూలో బయోమెట్రిక్ హాజరు

- మాజీ వీసీ ప్రసాద్‌రెడ్డిపై ఆరోపణల నేపథ్యంలో చర్యలు



హాజరుకు ఉపయోగిస్తున్న పరికరం

**విశాఖపట్నం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి):** ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మాజీ వీసీ ప్రసాద్‌రెడ్డి విధులకు సరిగా హాజరు కావడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో అధికారులు ముఖ గుర్తింపు పరికరంతో (బయోమెట్రిక్) హాజరు తీసుకోవాలని నిర్ణయించారు. దీనికి మంగళవారం నుంచే శ్రీకారం చుట్టారు. కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన ప్రసాద్‌రెడ్డి రోజూ ఉదయం 11.30 గంటల తరువాతే విధులకు హాజరవుతుండగా, అంతకుముందే రిజిస్టర్‌లో సంతకాలు జరిగిపోతున్నాయి. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తేవడంతో విచారణకు కమిటీని వేశారు. దీంతో ప్రసాద్‌రెడ్డి సిక్ లీవు పెట్టి వెళ్లిపోయారు. అయితే హాజరు పరిశీలన ఒకటి రెండు రోజులతో అయ్యేది కాదని, బయోమెట్రిక్ అమలుచేస్తే పరిస్థితిలో మార్పు వస్తుందని 'ఆంధ్రజ్యోతి' సూచించడంతో అధికారులు ఆచరణలోకి తీసుకువచ్చారు. ఈ మేరకు ఫేస్ రికగ్నిషన్ పరికరాలు తెప్పించి సీఎస్ఈతో పాటు మరో మూడు విభాగాల్లో అమలు చేస్తున్నారు. వీటి ద్వారా ఎవరు ఎప్పుడు వచ్చారో తెలుస్తుంది. దీనిని సెంట్రల్ ఆఫీసుకు అనుసంధానం చేసి, అక్కడి నుంచే పరిశీలించే వెసులుబాటుంది.

## మంత్రి లోకేశ్ దృష్టికి సమస్యలు



మంత్రి నారా లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందచేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

సీతమ్మధార, ఆగస్టు 13: ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే బీజేపీ ఫ్లోర్ లీడర్ పి.విష్ణుకుమార్ రాజు విజయవాడలో విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను వివరించారు. విద్యార్థులకు గత వైసీపీ పాలన నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ సక్రమంగా విడుదల కావడలేదన్నారు. దీంతో విద్యార్థులపై సర్టిఫికెట్లు ఇవ్వకుండా కళాశాల యాజమాన్యాలు ఒత్తిడి తీసుకువస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి స్పందించి ఫీజు విడుదలపై చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కాలేజీల్లో మౌలిక సదుపాయాలు ఉండేటట్లు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. దీనిపై సానుకులంగా స్పందించిన లోకేష్ పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు.

## హ్యాండ్ బాల్ టోర్నీకి విద్యార్థినుల ఎంపిక



ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయుడు

పూర్ణామార్కెట్, ఆగస్టు 13: వన్‌టౌన్‌లోని క్వీన్ మేరీ బాలిక పాఠశాల విద్యార్థినులు 17,18 తేదీల్లో అనంతపురంలో జరగనున్న హ్యాండ్‌బాల్ పోటీలో ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు వి.జోగేంద్రనాథ్ తెలిపారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థినులను అభినందించారు. పాఠశాలలోని నిహారిక, భార్గవి, అను, లహరి, మానస, జాస్మిన్, అస్మిత, సౌజన్య ఈ టోర్నీలో పాల్గొననున్నట్టు చెప్పారు.

## ఆల్ ఫ్రెడ్ హిచ్‌కాక్ గొప్ప సినీ దర్శకుడు



హిచ్‌కాక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

సీతంపేట, ఆగస్టు 13: ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ప్రపంచ సినీ దర్శకుడు ఆల్‌ఫ్రెడ్ హిచ్‌కాక్ 125వ జయంతి వేడుకలను వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. హిచ్ కాక్ చిత్రపటానికి నరవ ప్రకాశరావు, భరణికాన రామారావు, ఎస్‌కె మిస్రో తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిచ్‌కాక్ అప్పట్లో సాంకేతిక పరిజ్ఞానం లేని రోజుల్లోనే ఎంతో మంచి సినిమాలు అందించారన్నారు. అందుకే ఆయనను మాస్టర్ ఆఫ్ సస్పెన్స్ అని పేరు గాంచారన్నారు. కార్యక్రమంలో భాగంగా ది బర్డ్స్ ఇంగ్లీస్ చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో బి. చిన్నారావు, హాన్సెన్, చాట్ల బాబురావు రెడ్డి, ఎంవీవీ గుప్త, అరుణ, తదితరులు పాల్గొన్నారు.





ఉమెన్స్ కాలేజీ విద్యార్థినుల ర్యాలీ..



జాతీయ జెండాతో బుల్లయ్య కళాశాల విద్యార్థులు

# వాడవాడలా హర్ ఘర్ తిరంగా ర్యాలీలు

అక్కయ్యపాలెం, ఆగస్టు 13: గ్రేటర్ 42వ వార్డు బీజేపీ అధ్యక్షుడు గురుగోవింద్ సింగ్, జగన్నాథపురంలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.ఆశాదేవి సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులు నలభై అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కన్వీనర్ అత్తిలి శంకరరావు, సీనియర్ నాయకులు రాజగిరి కృష్ణ, అరుణ పాల్గొన్నారు.

**జాతీయ జెండా ఊరేగింపు**

సీతమ్మధార: ఇండిపెండెన్స్ డే సందర్భంగా డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల విద్యార్థులు తిరంగ రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 75 మీటర్ల జాతీయ జెండాతో కళాశాల ఎన్‌సీసీ, నేవీ, ఆర్మీ వింగ్‌లకు చెందిన విద్యార్థులు కళాశాల నుంచి సిరిపురం మీదుగా కాంప్లెక్సు గాంధీ విగ్రహం అక్కడి నుంచి కళాశాలకు చేరుకున్నారు. ఈ కార్యక్రమలో అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**వాల్తేరు రైల్వేలో...**

విశాఖపట్నం: వాల్తేరు రైల్వేలో మంగళవారం హర్ ఘర్ తిరంగ కార్యక్రమం చేపట్టారు. మూడు రోజులపాటు నిర్వహించనున్న ఈ వేడుకలలో భాగంగా రైల్వే కాలనీలో ఇళ్ల వద్ద జాతీయ జెండాను ప్రదర్శించడంపై అవగాహన కల్పిస్తున్నారు. దేశభక్తి స్ఫూర్తి ప్రతిబింబించేలా డివిజన్‌లోని అన్ని స్టేషన్ల భవనాలు, కార్యాలయాలతోపాటు లోకో మోటివ్‌లు మూడు రంగుల లైట్లతో ప్రకాశించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఇక దేశ విభజన సమయంలో జరిగిన విషాదం, ఇతర సంఘటనలకు సంబంధించి వివిధ స్టేషన్లలో ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు.

విశాఖపట్నం (స్పోర్ట్స్): ప్రభుత్వ మహిళా కళాశాలలో మంగళవారం హర్ ఘర్ తిరంగ కార్యక్రమం నిర్వహించారు. కాలేజీ క్రీడా విభాగం, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ యూనిట్స్, కల్చరల్ కమిటి సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ కే గీతాంజలి, క్రీడా విభాగాధిపతి డాక్టర్ ఆర్.కిరణ్మయి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ బి.హైమావతి, డాక్టర్ జే లావణ్య పాల్గొన్నారు.

మాధవధార: మాధవదార, మురళీనగర్‌లలో టీడీపీ, బీజేపీ వార్డు అధ్యక్షులు ఎస్.వరప్రసాద్, కె.వెంకటరావు, ఎస్.రామకృష్ణ, ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని జీవీఎంసీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు అల్లుడు సునీల్ అగర్వాల్, కూటమి నాయకులు పాల్గొన్నారు.



మాధవధారలో ర్యాలీ నిర్వహిస్తున్న కూటమి నాయకులు



అక్కయ్యపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

## పర్యావరణాన్ని పరిరక్షించాలి



మాట్లాడుతున్న ఆచార్యులు ఎస్‌బీపీ రంగాచార్యులు

సీతంపేట, ఆగస్టు 13: ప్రజల్లో పర్యావరణ స్పృహను కల్పించాలని పర్యావరణ పరిరక్షణ సమితి సంయోజకులు, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆచార్యులు ఎస్‌పీబీ రంగాచార్యులు తెలిపారు. ద్వారకానగర్‌లోని బీవీకే కళాశాలలో భారతీయ శిక్షణ మండల్ నిర్వహణలో పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై ప్రసంగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాన వక్తగా విచ్చేసిన రంగాచార్యులు మాట్లాడుతూ ప్లాస్టిక్, పాలిథిన్‌లతో కలుగుతున్న ప్రమాదాన్ని ప్రచారం చేయాలన్నారు. సోలార్, బయో గ్యాస్ తదితర ఇంధన వనరులను ఉపయోగించుకోవాలన్నారు. సభలో పీఎస్ కుమార్, డాక్టర్ డీవీ సూర్యారావు, డాక్టర్ జేవీఎస్ఎన్ మూర్తి, కొత్తూరు రమణ, తదితరులు పాల్గొన్నారు.

## కెమికల్ విద్యార్థులకు భద్రతా చట్టాలపై అవగాహన



విద్యార్థినితో మాట్లాడుతున్న డా.నాగేశ్వరరావు

కంచరపాలెం, ఆగస్టు 13 : కెమికల్ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులు భద్రతా చట్టాలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని గాయత్రి కళాశాల ప్రొఫెసర్ డాక్టరు సీవీ నాగేశ్వరావు సూచించారు. మంగళవారం కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమల్లో భద్రతా నియమాలు, చట్టాలను విద్యార్థులకు వివరించారు. అలాగే, గతంలో వివిధ పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాలను వివరించారు.ప్లాస్టింగ్స్ &పాలీమర్స్ కోర్సు అభ్యర్థుల అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ అధ్యక్షతన జరిగిన ఈ సెమినార్‌లో సీనియర్ అధ్యాపకులు నాగవెంకటకుమారి, రామాంజనేయులు, అధ్యాపకులుపాల్గొన్నారు.

## సమరయోధులను స్ఫూర్తిగా తీసుకోవాలి: కలెక్టర్

మహారాణిపేట, ఆగస్టు 13: స్వాతంత్ర్య సాధన కోసం ఎన్నో త్యాగాలు చేసిన వారిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ నెల 9వ తేదీనుంచి నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా మంగళవారం సాగరతీరంలో ర్యాలీ నిర్వహించారు. జిల్లాలోని వివిధ విభాగాల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, క్రీడాకారులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బారత మాతకి జై అంటూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు , పింగళి వెంకయ్య లాంటి మహనీయులు జీవితాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ పి సంపత్‌కుమార్ , జాయింట్ కమిషనర్ ఫకీరప్ప, ఆర్‌డీవో హుస్సేన్ సాహెబ్ అధికారులు జ్ఞానవేణి, డీడీ రామారావు , ఈడి శ్రీనివాసరావు జాన్‌గ్వాలియట్ పాల్గొన్నారు.

## ఆటల పోటీలు

అక్కయ్యపాలెం, ఆగస్టు 13 : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో పీడీ ఎ.సునంద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం ఆటల పోటీలు నిర్వహించారు. కబడ్డీ, క్రికెట్, రన్నింగ్, క్యారమ్స్, చెస్ తదితర పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలుగు ఉపాధ్యాయుడు ఎంవీ ధర్మారావు ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు జరిగాయి. విజేతలకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో బహుమతులు ప్రదానం చేయనున్నారు.

# రోగులతో కిటకిటలాడిన ఓపీ

- వైద్యులు లేక ఖాళీగా కుర్చీలు
- జుడోల సమ్మెతో కేజీహెచ్‌లో వైద్య సేవలకు అంతరాయం
- ఓపీ హాజరుకాని సీనియర్ వైద్యులు
- రోగుల తీవ్ర అవస్థలు



ఓపీ వద్ద రద్దీ



ఖాళీగా ఉన్న వైద్యుని కుర్చీ

మహారాణిపేట, ఆగస్టు 13: కోల్‌కతాలో వైద్య విద్యార్థిని హత్యాచారఘటనకు నిరసనగా మంగళవారం జూనియర్ వైద్యుల విధుల బహిష్కరణతో కేజీహెచ్‌లో ఓపీ సేవలకు తీవ్ర అంతరాయం కలిగింది. రోగులు తీవ్ర ఇబ్బందులకు లోనయ్యారు. సీజనల్ జ్వరాలతో అధిక శాతం మంది వచ్చారు. ఓపీ విభాగాలన్నీ కిటకిటలాడాయి. ప్రధానంగా అవుట్‌పేషంట్ల విభాగంలో పీజీ వైద్యులతోనే రోగులకు వైద్య సేవలు అందిస్తారు. కోల్‌కతాలో వైద్య విద్యార్థిని ఆత్యాచారం చేసి హత్యకు పాల్పడిన ఘటనకు నిరసనగా జూనియర్ వైద్యుల సమ్మె కారణంగా విధులకు దూరంగా ఉన్నారు. ఈ విషయం తెలిసినా ఓపీలలో రోగులకు వైద్య సేవలకు అంతరాయం కలగకుండా ప్రధాన విభాగాలకు చెందిన హెచ్‌వోడీలు (విభాగాధిపతులకు) అందుకు తగిన చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు తలెత్తుతున్నాయి. రోజువారి యూనిట్లు ప్రకారం విధులకు హాజరుకావాల్సిన ప్రధాన వైద్యులైన ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసరు కూడా ఓపీ విధులకు హాజరుకాకపోవటంతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆర్థోపెడిక్, మెడికల్, సర్జికల్, న్యూరో, గ్యాస్ట్రో తదితర విభాగాల్లో కేవలం ఒక్కో వైద్యుడితో రోగులకు సేవలు పరిమితం చేశారు. దీంతో రోగులు మధ్యాహ్నం వరకు బారులు తీరి కనిపించారు. ఆసుపత్రి అధికారులు సైతం జూనియర్ వైద్యుల సమ్మెతో తలెత్తే సమస్యలకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడంపై రోగులు అసహనం వ్యక్తం చేశారు. జూనియర్ వైద్యులు హత్యాచార నిందితులకు అరెస్టు చేసే వరకు నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరిస్తున్నారు. ఈనేపథ్యంలో రోగులకు ఇబ్బందులేకుండా కేజీహెచ్‌లో వైద్య సేవలందేలా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు

## అత్యంత ప్రతిష్ఠాత్మకంగా 'వారధి'

- నార్త్ బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

సీతమ్మధార, ఆగస్టు 13: ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి వారధి అనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్టు దక్షిణ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే ఫ్లోర్ లీడర్ విష్ణుకుమార్ రాజు తెలిపారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం రోజున విజయవాడలో కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి చేతుల మీదుగా ఈ కార్య క్రమం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్ర రాష్ట్ర యూనిట్ మొత్తం కలిసి విజయవాడలో ఆదివారం తప్పా మిగిలిన రోజుల్లో ఈ కార్యాలయంలో అందుబాటులో ఉంటూ ఎమ్మెల్యేలేదా మంత్రుల ఆధ్వర్యంలో ప్రజల సమస్యలపై వినతి పత్రాలు స్వీకరిస్తామన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కారిస్తామన్నారు. బీజేపీ ప్రజా ప్రతినిధులు రోజుకు ఒక్కరు చొప్పున కార్యాలయంలో అందుబాటులో ఉంటారని తెలిపారు.

## తంగలాన్ చిత్రం ఆదరించాలి

- సినీ హీరో విక్రమ్
- విశాఖలో సందడి చేసిన యూనిట్



సమావేశంలో హీరోహీరోయిన్ విక్రమ్, మాళవిక మోహనన్ తదితరులు

సాగర్‌నగర్, ఆగస్టు 13: తంగలాన్ చిత్రానికి తెలుగు ప్రేక్షకులు అఖండ విజయం అందించాలని సినీ హీరో విక్రమ్ అన్నారు. తంగలాన్ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా హీరోయిన్ మాళవిక మోహనన్, నిర్మాత జ్ఞానవేల్ రాజాతో కలిసి మంగళవారం సాగర్‌నగర్ సమీపంలోని రాడిసన్‌బ్లూ రిసార్ట్స్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో విక్రమ్ మాట్లాడుతూ.. ఈ చిత్రం నిర్మాణ సమయంలో యూనిట్ ఎంతో శ్రమించినట్టు చెప్పారు. మేకప్ కోసం గంటల సమయం వెచ్చించాల్సి వచ్చేదన్నారు. కఠినతరమైన పాత్రలు పోషించడం, అడ్వంచర్స్ సృష్టించడం అంటే తనకు ఇష్టమన్నారు. తెలుగు రాష్ట్రాల ప్రజలు తనను ఎంతగానో ఆదరించారన్నారు. ఈ చిత్రం ఈనెల 15వ తేదీన విడుదల కానున్న నేపథ్యంలో ప్రచారం చేస్తున్నట్టు తెలిపారు. స్వాతంత్ర్యానికి పూర్వం కోలార్ గోల్డ్ ఫీల్డ్స్‌లో జరిగిన వాస్తవ సంఘటనలను ఆధారం చేసుకుని ఈ చిత్రం తెరకెక్కించామన్నారు. విశాఖ ప్రకృతి అందాలకు నిలయమని అన్నారు. తెలుగు, తమిళభాషల్లో విడుదల చేయనున్నామన్నారు. 2022లో ప్రారంభమైన ఈ చిత్ర నిర్మాణం చెన్నై, హైదరాబాద్, మధురై, కర్ణాటక సహా పలు లోకేషన్లలో చిత్రీకరించారు. ఈ చిత్రం ట్రైలర్ విడుదలై ఇప్పటికే అలరిస్తోందన్నారు. ఈ పాన్ ఇండియా సినిమాని పా. రంజిత్ తెరకెక్కించారు. నీలం ప్రొడక్షన్స్, స్టూడియో గ్రీన్, జియో స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించారు. పార్వతీ తిరువోతు, మాళవిక మోహనన్, పశుపతి తదితరులు ముఖ్యపాత్రలు పోషించారు. సంగీతం జి.వి. ప్రకాశ్‌కుమార్, ఛాయాగ్రహణం ఎ. కిశోర్‌కుమార్ సమకూర్చారు. చిత్రంలో విక్రమ్ డిఫరెంట్ రోల్‌లో కనిపించనున్నారు. కథానాయిక మాళవిక మోహనన్, మరో నటుడు డానియల్ చిత్రానికి సంబంధించి వారి అనుభవాలను పంచుకున్నారు.

## ఆటోనగర్ నిర్మాణం జరిగేలా చూడండి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు రాజు

జగదాంబ కూడలి, ఆగస్టు 3: నగర శివారు కణమాంలో ఆటో నగర్ నిర్మాణాన్ని ఏపీ ఐఐసీతో ఒప్పందం మేరకే పూర్తిచేయాలని, దీని వల్లే కార్మికులకు న్యాయం చేకూరుతుందని సీఐటీ యూ నాయకుడు వై. రాజు అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కణమాంలో ఆటోనగర్ నిర్మాణాన్ని ఎంఎస్ఎంఈ పార్కు సంస్థకు అప్పగిస్తున్నట్లు ప్రచారం జరుగుతుందని, ఈ యోచన తక్షణం నిలుపు చేయాలన్నారు. ఆటోనగర్ కోసం తీసుకున్న భూములకు చెల్లించాల్సి నష్టపరిహారం కొంతమంది రైతులకు ఇవ్వలేదన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఆటోనగర్ నిర్మాణం కోసం భూములు కేటాయించడం జరిగిందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోలేదని విమర్శించారు. ఇప్పటికైనా కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో కార్మికలు, సిఐటియు నాచకులు పాల్గొన్నారు.

## మాజీమంత్రి శివశంకర్ చిరస్మరణీయులు

డాబాగార్డెన్స్, ఆగస్టు 13 : కేంద్ర న్యాయశాఖ మంత్రి, దివంగత నేత పి.శివశంకర్ దేశానికి ఎనలేని సేవలు చేశారని పలువురు వక్తలు కొనియాడారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆప్తా ఆధ్వర్యంలో శివశంకర్ జయంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమర్జెన్సీ సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆయన దేశానికి ఎనలేని సేవలందించారని గుర్తుచేశారు. శివశంకర్‌కు సమాజంపై ఎంతో నిబద్ధత ఉండేదని, వ్యత్యాసాలను రూపుమాపేందుకు న్యాయపరమైన అంశాలపై ఆయన ఎల్లప్పుడూ పోరాడేవారన్నారు. కులమతాలకతీతంగా న్యాయమూర్తులను ఎంపిక చేసి ఆయన పేరుగాంచారన్నారు. అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ ఆప్తా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి న్యాయవాదిఅ గేదెల కిషోర్ సభాధ్యక్షులుగా వ్యవహరించారు. ముఖ్య అతిథిగా సీనియర్ న్యాయవాది కేవీ రామ్మూర్తి, మాజీ మెట్రో పాలిటన్ స్పెషల్ మెజిస్ట్రేట్ టీవీ రమణ, ఏపీ స్టేట్ బార్ అసోసియేషన్ వైస్ ఛైర్మన్ కీర్తి రామజోగేశ్వరరావు, జిల్లా బార్ అసోసియేషన్ సెక్రటరీదంతనరేష్‌కుమార్ హాజరయ్యారు. ఆప్తా సంఘం అప్పికొండ కాత్యాయని చిక్కాల జగదీశ్వరి, ఎ.దొరబాబు, డా.వసంతరాజేంద్రప్రసాద్, రాకేష్, పతివాడ విద్యాసాగర్, ఆప్తా కో ఆర్డినేటర్ బావిశెట్టి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదమేనా..?

... 5వ పేజీ తరువాయి

రూపకల్పన చేయడంతో ఆ స్థలం లీజుని కొన్నాళ్ల కిందట జీవీఎంసీ రద్దుచేసి, స్థలాన్ని స్వాధీనం చేసుకుంది. దీనిపై సంస్థ కోర్టును ఆశ్రయించింది. బీచ్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు పనులు ప్రారంభించినపుడు తాము స్వచ్ఛందంగా స్థలాన్ని అప్పగిస్తామని, అప్పటివరకు మార్కెట్ ధర ప్రకారం లీజుకు ఇవ్వాలని కోర్టును కోరింది. దీనికి జీవీఎంసీ కూడా సమ్మతించడంతో కేసు ఉపసంహరించుకున్నారు. తర్వాత జీవీఎంసీ 419 గజాల స్థలాన్ని తిరిగి సిల్వర్‌స్పూన్ సంస్థకు లీజు ప్రాతిపదికన కేటాయించింది. ఈ గడువు వచ్చే ఏడాది మే వరకూ ఉంది.

ఇదిలా ఉండగా జీవీఎంసీ లీజుకు కేటాయించిన 419 గజాల స్థలం పోగా మిగిలిన 1,831 గజాల స్థలం కూడా అనధికారికంగా ఆక్రమించుకుని వ్యాపారం సాగిస్తున్నారని చాలా మంది జీవీఎంసీకి ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ గత ప్రభుత్వంలోని పెద్దల ఒత్తిడితో అధికారులు పట్టించుకోలేదు. తాజాగా జిల్లలోని జనసేన నేతకు చెందిన బంధువు ఆ స్థలంపై కన్నేశారు. సిల్వర్‌స్పూన్‌కు కేటాయించిన 419 గజాలు మినహాయించి, మిగిలిన స్థలాన్ని లీజు పేరుతో చేజిక్కించుకునేందుకు కొద్ది రోజులుగా ప్రయత్నాలు ప్రారంభించారు. ఇందులో భాగంగా ఇటీవల జీవీఎంసీ అధికారులను కూడా కలిసి, దీనిపై చర్చించినట్టు తెలిసింది. అయితే ఆస్థలంలో ఇప్పటికే కొన్ని దుకాణాలు, ఇతర ఆక్రమణలు ఉన్నందున వాటిని తొలగించాలంటే పైస్థాయి నుంచి ఆదేశాలు రావాలని, ఖాళీ స్థలమైతే లీజుకు ఇచ్చేస్తామని అధికారులు తేల్చినట్టు సమాచారం. ఇదిలా ఉండగా ఆక్వాస్పోర్ట్ కాంప్లెక్స్‌కు ముందువైపు బీచ్‌రోడ్డును ఆనుకుని ఉన్న ఐస్‌క్రీమ్ దుకాణం రిజర్వేషన్ కేటగిరీలో ఒక మహిళ వేలంలో దక్కించుకున్నారు. ఆ దుకాణాన్ని కూడా ఈ జనసేన నేత బంధువే చేజిక్కించుకున్నట్టు తెలిసింది. రిజర్వేషన్ కేటగిరీ కావడంతో ఆమె పేరుతో లీజు ఉన్నప్పటికీ, దుకాణం తన ఆధీనంలోనే ఉంచుకున్నట్టు సమాచారం. ఈ తరుణంలోనే సిల్వర్‌స్పూన్ రెస్టారెంట్‌ను ఆనుకుని ఉన్న డైనోపార్కులో సందర్శకులు లేని సమయంలోనే అగ్నిప్రమాదం జరగడం పలు అనుమానాలకు దారితీసింది. ఈ స్థలాన్ని చేజిక్కించుకునేందుకు జనసేన నేత బంధువే ప్రమాదం సృష్టించి ఉంటారని అనుమానిస్తున్నారు. ఈ విషయాన్ని త్రీటౌన్ సీఐ వద్ద ప్రస్తావించగా, దర్యాప్తులో అన్ని విషయాలు బయటపడతాయన్నారు.

# మన రిజర్వాయర్లు భద్రమేనా..!

... 5వ పేజీ తరువాయి

మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌లో నీటిని జీవీఎంసీ అవసరాలకు వినియోగిస్తున్నారు. వాడుకునే నీటికి జీవీఎంసీ సొమ్ములు చెల్లించడంలేదు.. చివరకు నీటి పారుదల శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదించినా నిధులు విడుదలచేయడంలేదు. రిజర్వాయర్‌కు ఉన్న ఆరు గేట్లలో ఒకటి, ఐదోగేటు పూర్తిగా మొరాయించాయి. వరద వచ్చినపుడు రెండు, మూడు, నాలుగు, ఆరోగేటు పైకి ఎత్తి నీటిని విడిచిపెడుతున్నారు. మరిన్ని గేట్లకు సంబంధించిన బోల్టులు ఊడిపోయి కిందకు జారిపోవడంతో వరదల సమయంలో పైకి ఎత్తే క్రమంలో మొరాయించే ప్రమాదం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రతి ఏటా గేట్లకు గ్రీజు రాయడం, పెయింటింగ్ వేయడం చేయాల్సి ఉంటుంది. అయితే గడచిన ఐదేళ్లలో జీవీఎంసీ కేవలం రూ.రెండు లక్షలు మంజూరుచేసింది. కూటమి ప్రభుత్వం అధికారంచేపట్టిన తరువాత ప్రాజెక్టుల మరమ్మతులు చేపట్టాలని జలవనరుల శాఖా మంత్రి ఆదేశాలతో మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ గేట్లు తక్షణ మరమ్మతులకు రూ.4 కోట్లతో ప్రపాదించారు. మొరాయించిన 1, 5 గేటును యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ప్రతిపాదనలో పేర్కొన్నారు. రిజర్వాయర్‌లో నీరుండడంతో ఈ ఏడాది పూర్తిగా మరమ్మతులు చేయడం సాధ్యంకాదని అధికారులు భావిస్తున్నారు. అయితే వరదలు వచ్చినపుడు ఇబ్బందిలేకుండా ఒకటి, ఐదోగేటు పైకిలేచేలా కొంతవరకు మరమ్మతులకు అవకాశం ఉందని, ఇందుకు నిధులు అవసరమని చెబుతున్నారు. ఈ మేరకు ప్రతిపాదించిన అధికారులు, జీవీఎంసీ బకాయిల నుంచి తక్షణం రూ.3.205 కోట్లు విడుదలచేస్తే ఈ ఏడాది వర్షాకాలం ఇబ్బందులు అధిగమించవచ్చునని ప్రతిపాదించారు.

# అర్ధరాత్రి సర్దేశారు!

... 5వ పేజీ తరువాయి

విశ్వసనీయ సమాచారం. వాటిని పూర్తిచేస్తే భారీగా నజరానా అందుతుందని అధికారికి ఆశ చూపించాడని చెబుతున్నారు.

**రెండేళ్ల వరకు పెండింగ్‌లోనే**

బి.తాళ్లవలస ఇనాము భూములను రైతుల నుంచి ఇతరుల పేర్ల మీదకు రిజిస్ట్రేషన్ చేయడానికి జూన్ 2022లో భీమిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దశలవారీగా 38 డాక్యుమెంట్లు పెట్టారు. అవి ఇనాము భూములు కాబట్టి, రిజిస్ట్రేషన్ చేయలేమని తిరస్కరించాలి. కానీ ఈ అధికారి పెండింగ్ రిజిస్ట్రేషన్ చేశారు. సదరు భూములు 1-బి రికార్డుల్లో ఉన్నా ఆన్‌లైన్‌లో తహసీల్దార్ డిజిటల్ సంతకం లేదని గుర్తించారు. దీంతో అవి వెనక్కి పంపాలి. కానీ వారితో మంతనాలు జరిపారు. తాము ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి, తహసీల్దార్ సంతకం చేయిస్తామని, అంతవరకు డాక్యుమెంట్లు పెండింగ్‌లోనే ఉంచాలని వారు కోరడంతో రెండేళ్లకు పైగా వాటిని అలాగే ఉంచారు. మధ్యలో ఆ శాఖ ఉన్నతాధికారులు గుర్తించి, వాటిని వెనక్కి ఇవ్వాలని సూచించినా సబ్ రిజిస్ట్రార్ లెక్క చేయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ భూములపై ఆరా తీయగా ఈ విషయం బయటపడింది. ఇప్పుడైనా వాటిని తిరస్కరించకపోతే పీకల మీదకు వస్తుందని ఉన్నతాధికారులు హెచ్చరించడంతో పది రోజుల క్రితం ఆ అధికారి వాటిని తిరస్కరించారు. ఈ వ్యవహారం మొత్తం ఐజీకి తెలియడంతో ఆగమేఘాలపై వివరణ కోరి, సస్పెన్షన్‌కు ఆదేశాలిచ్చారు. అయితే అధికారులను లోబరుచుకొని, తప్పుడు పనులు చేయించే డాక్యుమెంట్ రైటర్లపైనా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

# రాజకీయ విలువలకు కట్టుబడే....

... 5వ పేజీ తరువాయి

సాగాలనే ఉద్దేశంతోనే బరి నుంచి తప్పుకున్నట్టు పల్లా వివరించారు.

**ముగిసిన నామినేషన్ల గడువు**

విశాఖపట్నం: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు నామినేషన్ల గడువు మంగళవారం సాయంత్రంతో ముగిసింది. కూటమి నుంచి ఎవరినీ పోటీకి దింపడం లేదని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రకటించారు. స్వతంత్ర అభ్యర్థులు కూడా నామినేషన్లు వేయలేదు. వైసీపీ తరఫున బొత్స సత్యనారాయణ, స్వతంత్ర అభ్యర్థిగా మరో వ్యక్తి సోమవారం సమర్పించిన నామినేషన్లే మిగిలాయి. వీటిని బుధవారం పరిశీలిస్తారు.



## గాజుల అలంకరణలో మహా కామేశ్వరి

**పెందుర్తి, ఆగస్టు 13:** పెందుర్తి వెంకటాద్రి శిఖరం ఘాట్ రోడ్డు దిగువన గల మహా కామేశ్వరి సహిత ద్వాదశ సహిత జ్యోతిర్లింగాలయంలో శ్రావణ మంగళ వారాన్ని పురస్కరించుకుని మహాకామేశ్వరి మాతను గాజులతో శోభాయమానంగా అలంకరించారు. రంగు రంగుల గాజులతో అలంకరించిన అమ్మవారిని దర్శిం చేందుకు పరిసర ప్రాంతాలకు చెందిన చేసిన భక్తుఉల అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ సన్నిధిలో లక్ష కుంకుమార్చన చేశారు. ఆలయ చైర్మన్ ధవళ యజ్ఞేశ్వర చైనులు ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేపట్టారు.

## ఘనంగా ఆలయ వార్షికోత్సవం

**అగనంపూడి, ఆగస్టు 13:** జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడక ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దేవత పైడిమాంబ ఆలయ 14వ వార్షికో త్సవాన్ని మంగళ వారం ఘనంగా నిర్వ హించారు. వేకువ జా మున అమ్మవా రిని నూతన వస్త్రాలు, వివిధ రకాల కూరగా యలు, పుష్పాలతో అర్చకులు అలంకరించి పూజలు జరిపారు.



పూజలందుకున్న పైడిమాంబ

పరిసర ప్రాంతా లకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. షిర్డీసాయి, సత్య సాయి భజన మండలి ఆధ్వర్యంలో నగర సంకీర్తలు, లలితాసహస్రనామ పారాయణాన్ని పఠించారు. కార్యక్ర మంలో ఆలయ కమిటీ ప్రతినిధులు మోటూరి వెంకటర మణ, మజ్జి శ్రీను, జి.అప్పారావు, వి.నారాయణరావు, కొండలరావు, సత్యనారాయణ, డ.అప్పలనాయుడు, వర హాలు, నరసింహనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## వ్యాయామశాల పనులు పరిశీలన

**పెందుర్తి-రూరల్, ఆగస్టు 13:** జీవీఎంసీ 95వ వార్డు పరిధి గొల్లవిల్లివానిపాలెం సమీపంలోని సాయి సౌదానగర్ పార్కులో రూ.9.63 లక్షలతో చేపట్టిన వ్యాయామశాల నిర్మాణ పనులను మంగళవారం కార్పొరే టర్ ముమ్మన దేముడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక ఆరోగ్యానికి వ్యాయామం ఎంతో అవసరమన్నారు. జిమ్ పరిరక్షణపై స్థానికులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీ సంఘం ప్రతినిధులు ఎ.వాసు, పెం టారావు, నాయుడు, సూరిబాబు, లక్ష్మి, భవానీ, కృష్ణా రావు, తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక వసతులు కల్పించాలని వినతి

**ఎన్.ఎ.డి.జంక్షన్, ఆగస్టు 13:** జీవీఎంసీ 90వ వార్డులోని వివిధ ప్రాంతాలకు మౌలిక వసతులు కల్పిం చాలని కోరుతూ కమిషనర్ సంపత్‌కుమార్‌ను స్టాండింగ్ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్ బొమ్మిడి రమణ మంగళ వారం వినతిపత్రం అందజేశారు. వార్డులోని లక్ష్మీనగర్ కొండవాలు ప్రాంతాల్లో, విమాన నగర్ డివైడర్ పనులతో పాటు ఇతర అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలన్నారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించినట్టు ఆయన తెలిపారని రమణ పేర్కొన్నారు.

## సినిమా గైడ్

- **కమిటీ కుర్రోళ్ళు :** శరత్, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), మోహిని (గాజువాక),
- **తుఫాన్ :** జగదాంబ, కిన్నెర, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-1 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ).
- **భవనమ్ :** మెలోడి, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మి (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి),
- **సింబా :** జగదాంబ, కామేశ్వరి, మోహిని (గాజువాక)
- **సూపర్‌డీలక్స్ :** జగదాంబ, మోహిని (గాజువాక)
- **సంఘర్షణ :** క్రాంతి
- **బడ్డీ :** సౌజన్య (గోపాలపట్నం), గణేష్ (తగరపువలస)
- **శివం భజే :** లక్ష్మీకాంత్ (గాజువాక)
- **రాయన్ :** శారద, సంగం, శ్రీకన్య-2 (గాజువాక)
- **కల్కి :** శ్రీరామ, కన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

## రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 40, టమాటా 28, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 20, పచ్చిమిర్చి 55, కాకరకాయలు 42, బీరకాయలు 30, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 36, క్యాబేజీ 26, క్యారెట్ 32, దొండకాయలు 34, బంగాళదుంపలు 36, అరటికాయ (పెద్దది) 8, అల్లం (పాతది) 140, మునక్కాడలు (కిలో) 46, బరబాటి 30, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 82, గోరుచిక్కుడు 36, దోసకాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 195, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 56, పొటల్స్ 34, కీరదోస 30, క్యాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 44, కంద 64, దేముడుచిక్కుడు 86, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

**కోడిగుడ్లు (నెక్)**

| (వంద - రూ.లలో) | |
|---|---|
| విశాఖపట్నం | 490 |
| విజయనగరం | 494 |
| శ్రీకాకుళం | 494 |

**చికెన్ ధరలు**

| బ్యాగ్ | | |
|---|---|---|
| రైతు ధర | -- | 75 |
| ఫారం ధర | -- | 95 |
| విత్ స్కిన్ | -- | 160 |
| స్కిన్‌లెస్ | -- | 170 |

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

# గాజువాకను గణనీయంగా అభివృద్ధి చేస్తా..

### టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



ఆలయ కమిటీ సభ్యులకు చెక్కు అందజేస్తున్న పల్లా శ్రీనివాసరావు, గోపిశెట్టి ఆదినారాయణ

**అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 13:** రాష్ట్రంలోనే గణనీ యమైన మెజారిటీతో తనను గెలిపించిన గాజువాక ప్రజల ఆశయాలకు అనుగుణంగా నియోజకవర్గాన్ని గణనీయంగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. అక్కిరెడ్డిపాలెంలో టీడీపీ 68వ వార్డు నాయకులు గోపిశెట్టి ఆదినారాయణ, సంగ్రాన గణేశ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన పౌర సన్మాన కార్యక్రమంలో వివిధ పార్టీల నేతలు పల్లాను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ డెయిరీ నుంచి విడుదలవుతున్న కాలుష్యం వల్ల అక్కిరెడ్డిపాలెం పరిసర ప్రాంతాల ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై డెయిరీ యాజమాన్యంతో చర్చించి సమస్య పరిష్కా రానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాలనీలోని రైల్వే ట్రాక్ నివాసితుల సమస్యతో పాటు పంచవటి భూ నిర్వాసితుల సమస్యను కూడా పరిష్కరించి తనను గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటానని పేర్కొ న్నారు. ఈ సందర్భంగా కాలనీలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న కుంచుమాంబ, దుర్గమాంబ ఆలయాల నిర్మాణానికి గోపిశెట్టి ఆదినారాయణ విరాళంగా ఇచ్చిన రూ.పది లక్షల చెక్కును పల్లా శ్రీనివాసరావు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరే టర్లు పల్లా శ్రీనివాస్, బొండా జగన్, బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంత లక్ష్మి, నాయకులు బొడ్డు రమణ, జి.వెంకటరావు, జి.అప్పారావు, ఎస్.రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

# శిథిలావస్థలో మల్కాపురం పోలీస్ క్వార్టర్స్

### అద్దె భవనాల్లో నివాసం ఉంటున్న సిబ్బంది

**మల్కాపురం, ఆగస్టు 13:** మల్కాపురం పోలీస్ క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకోవడంతో సిబ్బంది అద్దె భవనాల్లో నివాసం ఉంటున్నారు. ఒకప్పుడు ఎంతో ఆదర్శంగా నిలిచే ఈ కార్టర్స్ దయనీయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. అప్పట్లో మల్కాపురంతో పాటు గాజువాక, పెదగంట్యాడ, దువ్వాడ, పరవాడ పోలీస్ స్టేషన్లలో పనిచేసే సిబ్బందితో ఈ క్వార్టర్స్ కళ కళలాడేది. ఇక్కడే సీఐలు, ఎస్‌ఐలు కుటుంబాలతో ఉండేవారు. కాలక్రమేణా శ్లాబ్‌లు లీక్ కావడంతో సమస్య మొదలైంది. అనంతర కాలంలో క్వార్టర్స్ మొత్తం శిథిలావస్థకు చేరుకోవడంతో ఒక్కొక్కరు క్వార్టర్స్‌ను ఖాళీ చేసి తమకు అనుకూలంగా ఉన్న ప్రాంతాలకు అద్దెకు వెళ్లిపోయారు. దీంతో క్వార్టర్స్ మొత్తం బూత్ బంగ్లాను తలపించేలా మారింది. ప్రస్తుతం ఈ క్వార్టర్స్‌లో పోలీసులు వివిధ కేసుల్లో



పాడైపోయిన పోలీస్ క్వార్టర్స్

స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తుతో పాటు ద్విచక్ర వాహనాలను భద్రపరుస్తున్నారు. క్వార్టర్స్‌లోని భవ నాలన్నీ నాచు పట్టాయి. చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి.

విష సర్పాల సంచారం కూడా అధికంగా ఉంది. చోరీ సొత్తును పోలీసులు బయటకు తీసే సమయంలో ఒక్కోసారి వారిని పాములు భయభ్రాం తులకు గురి చేస్తున్నాయి. కొత్తగా ఇక్కడ క్వార్టర్స్‌ను నిర్మించాలంటే ప్రస్తుతం ఉన్న భవనాలను నేలమట్టం చేయాల్సి ఉంది. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌కు హౌస్ ఆఫీసర్‌గా వచ్చిన వారు ఉన్నతాధికారులకు లేఖ రాస్తున్నారు. ఎట్టకేలకు పోలీస్ హౌసింగ్ ఏడీసీపీ నారాయణ (ఏఆర్) ఇటీవల క్వార్టర్స్‌ను తనిఖీ చేశారు. క్వార్టర్స్ పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేది స్తామని స్థానిక సీఐ విద్యాసాగర్ తెలిపారు. త్వరలోనే కొత్తగా క్వార్టర్స్ నిర్మాణం జరుగుతుందని పలువురు సిబ్బంది ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఉక్కు కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తే ఊరుకోం

### ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్



స్టీల్‌ప్లాంట్ జీఎం గాంధీతో మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్, తదితరులు

**ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 13:** ఉక్కు కర్మాగారం కార్మిక వర్గాన్ని, సంస్థను ఇబ్బందు లకు గురిచేసే చర్యలకు యాజమాన్యం పాల్పడితే తాము తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తా మని ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశే ఖర్ హెచ్చరించారు. ప్లాంట్‌లో మంగళవారం జీఎం (హెచ్‌ఆర్) గాంధీతో ఇంటక్ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్మాగారంలో కార్మికులను తగ్గించేందుకు చేస్తున్న కుట్రను విరమించుకోవాలన్నారు. ప్లాంటుకు కావాల్సిన ముడిపదార్థాలు తక్కువగా వస్తున్నప్పటికీ మెరుగైన ఉత్పత్తిని సాధించడం జరుగుతుందన్నారు. కార్మికుల ఆర్థిక ప్రయోజనాలపై దెబ్బకొట్టడం సమంజసం కాదన్నారు. కేంద్రం ఆదేశాల ప్రకారం యాజమాన్యం నడుచుకుంటుందని, అలాంటప్పుడు స్థానికంగా నెలకొన్న ఇబ్బం దులు, పరిస్థితులను కేంద్రం, ఉక్కు మంత్రి త్వశాఖ దృష్టికి తీసుకువెళ్లాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. మూడున్నరేళ్లగా కార్మి కులు పోరాటాలు సాగిస్తున్నా కేంద్రం స్పందిం చకపోవడం దారుణమన్నారు. ఇకనైనా ప్లాం టును, కార్మికులను ఇబ్బందులకు గురి చేసే చర్యలను యాజమాన్యం మానుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, ఎస్ఏ నాయుడు, గొందేశి ప్రభాకర్‌రెడ్డి, కొవిరి అవతారం పాల్గొన్నారు.

# శబరి ఎక్స్‌ప్రెస్ రైలులో పోయిన బ్యాగ్ స్టీల్‌ప్లాంటులో లభ్యం

**ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 13:** పాసింజర్ రైలులో పోయిన బ్యాగ్ స్టీల్‌ప్లాంట్‌కు వచ్చిన గూడ్స్ రైలులో లభ్యమైంది. వివరాలిలా ఉన్నాయి. చెన్నైకు చెందిన కార్తికేయ అనే యువకుడికి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం వచ్చింది. దీంతో కార్తికేయ ఈ నెల ఎనిమిదిన శబరి ఎక్స్‌ప్రెస్ రైలులో కాట్‌పాడి నుంచి సికింద్రాబాద్ వెళ్లేందుకు రైలెక్కాడు.

ఆ రాత్రి రైలులో ఓ యువకుడు పరిచ యమయ్యాడు. ఆ యువకుడు కార్తికేయను నిద్రపోమని, బ్యాగును తాను చూస్తాననడంతో పడుకున్నాడు. అర్ధరాత్రి లేచి చూసేసరికి పక్కనున్న యువకుడితో పాటు బ్యాగు కనిపించకపో వడంతో ఒంగోలులో రైల్వే పోలీసులకు, స్థానిక పోలీసులకు కార్తికేయ ఫిర్యాదు చేశాడు. అనంతరం సికింద్రాబాద్ చేరుకుని అక్కడ కూడా పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



అయోధ్యరామ్‌కు బ్యాగ్ అందజేస్తున్న ఉక్కు ఉద్యోగులు

బ్యాగ్‌లో నగదు, ల్యాప్‌టాప్, సర్టిఫికెట్లు వంటివి ఉన్నాయని పేర్కొన్నాడు. కాగా ఈ బ్యాగ్ మంగళవారం స్టీల్‌ప్లాంట్‌కు విచ్చేసిన ఓ గూడ్స్ రైలులో కనిపించ డంతో పలువురు ఉక్కు ఉద్యోగులు సీఐటీయూ ప్లాంట్ గౌరవ అధ్యక్షుడుకు జె.అయోధ్యరామ్‌కు అందజేశారు. ఇందులో విలువైన వస్తువులు ఉన్నట్టు గుర్తించారు. బ్యాగులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా కార్తికేయకు ఫోన్ చేసి సమాచారం అందించారు. రైలులో పరిచ యమైన వ్యక్తి యువకుడు బ్యాగులో ఉన్న మూడు వేల రూపాయలను తీసుకుని దానిని గూడ్స్ రైలులోకి విసిరేసి ఉంటాడని భావిస్తున్నారు. ఈ బ్యాగును సికిం ద్రాబాద్‌లో ఉంటున్న కార్తికేయకు పంపిస్తామని అయోధ్యరామ్‌కు తెలిపారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో లావు రత్తయ్య, తదితరులు

## మంచి ప్యాకేజీతో విజ్ఞాన్ విద్యార్థులకు ఉద్యోగాలు

**అగనంపూడి, ఆగస్టు 13:** దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్‌ఈ ఫైనలియర్ చదువుతున్న 11 మంది విద్యార్థులు మంచి ప్యాకేజీతో కూడిన ఉద్యోగా లకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ జె.సుధాకర్ తెలిపారు. ప్రముఖ ఐటీ కంపెనీ ఇన్ సర్కిల్స్‌కు రూ.పది లక్షల వార్షిక వేతనంతో కూడిన ఉద్యోగాలకు ఎనిమిది మంది, ఫుల్ స్టాక్ డెవలపర్స్ కంపెనీకి రూ.ఆరు లక్షల వార్షిక వేతనంతో కూడిన క్వాలిటీ ఎనలిస్ట్ ఉద్యోగాలకు ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య అభినందిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి సంవత్సరం నుంచే క్రమశిక్ష ణతో కూడిన విద్యను విద్యార్థులకు అందించడంతో పాటు ఉద్యోగాలు సాధించేలా శిక్షణ ఇస్తున్నామని పేర్కొన్నారు. అధ్యాపక సిబ్బందికి అభినందనలు తెలిపారు. కార్యక్ర మంలో రెక్టార్ మధుసూదనరావు, డీన్ బోడే ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలను వివరిస్తున్న ఎస్ఐ నరసింగరావు

**వేపగుంట, ఆగస్టు 13:** ట్రాఫిక్ నిబంధనలపై వేపగుంట హైస్కూల్ విద్యార్థు లకు పెందుర్తి ట్రాఫిక్ పోలీసులు మంగళవారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా విద్యార్థులు రహదారిపై రాకపోకలు సాగించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్ర త్తలు, హెల్మెట్ ధారణ వల్ల కలిగే ప్రయోజనాలు, ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఏ విధంగా రహదారి దాటాలో వివరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ. నరసింగరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, ఉపాధ్యాయులు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

## వుడా నగర్ పార్కులో జిమ్ పరికరాలు ఏర్పాటు

**కూర్మన్నపాలెం, ఆగస్టు 13:** జీవీఎంసీ 86వ వార్డు పరిధి వుడా నగర్ ఫేజ్-2 పార్కులో జీవీఎంసీ ఆర్థిక సాయంతో చిన్నారులు ఆడుకునేందుకు, యువతీ యువకులు, పెద్దల కోసం జిమ్ పరికరాలను ఏర్పాటు చేశారు. దీంతో కాలనీకి చెందిన చిన్నారులు ఉదయం, సాయంత్రం వేళల్లో ఎంతో ఉల్లాసంగా పార్కులో ఆటలాడుకుంటున్నారు.



చినముసిడివాడలో నిర్మిస్తున్న కల్యాణ మండపాన్ని పరిశీలిస్తున్న విశ్వనాథన్

## వీఎంఆర్డీఏ కమిషనర్ క్షేత్రస్థాయి పర్యటన

**విశాఖపట్నం, ఆగస్టు 13:** క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా వీఎంఆర్డీఏ మె ట్రోపాలిటన్ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ మంగళవారం చినముసిడివాడలో నూ తనంగా నిర్మిస్తున్న రెండంతస్థుల కల్యాణ మండపాన్ని పరిశీలించారు. సంస్థకు ఆ దాయం పెంచేలా నిర్వహణా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అ నంతరం సబ్బవరం నుంచి గుల్లేపల్లి వరకు రూ.5.71 కోట్లతో చేపట్టిన రోడ్డు విస్తర ణ పనులను తిలకించారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను పక్కకు మార్చే పనులను వేగవంతం చేయాలన్నారు. అడ్డూరు, పైడివాడ అగ్రహారం, కోడూరు 1,2,3,4, లే అ వుట్‌లలో మౌలిక వసతుల కల్పన పనులను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. అదేవిధంగా అనకాపల్లి రావుగోపాలరావు కళాక్షేత్రంలో జరుగుతున్న మరమ్మతులను, తుమ్మపాలలో సంస్థకు చెందిన భూములు పరిశీలిం చారు. ఆ తర్వాత అనకాపల్లి కలెక్టర్ విజయ్‌కృష్ణన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆ ర్‌సీ లేఅవుట్లపై చర్చించారు. ఆయన వెంట ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, ముఖ్య ప్ర ణాళికాధికారి సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజనీర్ భవానీశంకర్, ఇతర ఇంజనీరిం గ్ అధికారులు ఉన్నారు.

## మార్కెట్లలో పంద్రాగస్టు సందడి

**గోపాలపట్నం, ఆగస్టు 13:** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్కెట్లలో సందడి నెలకొంది. మార్కెట్లో ఎక్కడ చూసిన మువ్వన్నెల పతాకాలే దర్శనమిస్తున్నాయి. ఇప్పటికే పాఠశాలల్లో విద్యార్థులకు పలు క్రీడా పోటీలు, వ్యాసరచన, వక్తృత్వ, తదితర పోటీలు నిర్వహించారు. పలు ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి గదులను విద్యార్థులు జెండాలతో అలంకరించారు. ప్రభుత్వ కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థలు జెండా పండగ కోసం ఏర్పాట్లు చేస్తున్నాయి. దీంతో జాతీయ జెండాలు బజారులో జోరుగా విక్రయాలు సాగుతున్నాయి. జేబుకు పెట్టుకునే విధంగా రూపొందించిన పలు రకాల జాతీయ పతాకాలు, బ్యాడ్జీలు వంటివి ఎంతో ఆకర్షణీయంగా ఉండడంతో వీటి అమ్మకాలు ఆశాజనకంగా సాగుతున్నాయి.

## 85వ వార్డులోని సమస్యలను పరిష్కరించాలి

**అగనంపూడి, ఆగస్టు 13:** జీవీఎంసీ 85వ వార్డు పరిధి మంత్రిపాలెం, శివారు కాలనీల్లో గల సమస్యలను పరిష్కరించాలని మాజీ కార్పొరేటర్ దుల్ల లక్ష్మీరామునా యుడు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పూర్తి స్థాయిలో మౌలిక వసతులు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా గత కొన్ని నెలలుగా వీధి లైట్లు వెలగ డం లేదని, ఈ కారణంగా చీకటి పడితే గ్రామాల్లో అంధకారం తాండవిస్తోంద న్నారు. పూర్తి స్థాయిలో డ్రైనేజీలు లేకపోవడంతో మురుగు నీరు ఇళ్ల మధ్యలోనే నిలి చిపోతుండడంతో ప్రజలు నానాపాట్లు పడుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా స్థానిక జెఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, ఈ కారణంగా దోమలు స్వైరవిహారం చేస్తున్నాయన్నారు. అందువల్ల జీవీఎంసీ అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని ఆమె కోరారు.



బైక్ ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు రవీంద్ర, కరణంరెడ్డి, తదితరులు

## గాజువాకలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

**గాజువాక, ఆగస్టు 13:** ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు భారతీయ జనతా పార్టీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగ రావు ఆధ్వర్యంలో మంగళవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, జనసేన నాయకుడు గడసాల అప్పారావులు జాతీయ జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ కొత్త గాజువాక నుంచి పాత గాజువాక వరకూ సాగింది. ఈ సందర్భంగా మేడపాటి రవీంద్ర మాట్లాడుతూ ప్రతి ఇంటిపై, కార్యాలయాలు, వాహనాలపై జాతీయ జెండాలను ఎగురవేసి దేశభ క్తిని చాటాలన్నారు. కరణంరెడ్డి నరసింగరావు మాట్లాడుతూ ఎంతోమంది మహనీయుల త్యాగాలతో మనకు స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. కార్యక్ర మంలో కూటమి నాయకులు గంధం వెంకటరావు, కృష్ణంరాజు, పావని, బాటా శ్రీను, ఎల్.సోంబాబు, తదితరులు పాల్గొన్నారు.

### దేశభక్తిని పెంపొందించడమే మోదీ లక్ష్యం

కూర్మన్నపాలెం: దేశభక్తిని ప్రజల్లో పెంపొందించడమే ప్రధాని మోదీ లక్ష్యమని బీజేపీ జిల్లా కార్యదర్శి బొండా ఎల్లాజీ అన్నారు. 86వ వార్డు భరత్‌న గర్‌లో మండల అధ్యక్షురాలు శ్రీదేవి ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్ర మాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎల్లాజీ మాట్లాడుతూ విద్యార్థులు, యువ తలో దేశభక్తి కలిగి ఉండాలన్నారు. శ్రీదేవి మాట్లాడుతూ 86,87,88 వార్డుల్లో ప్రతి ఇంటిపైనా జాతీయ పతాకాన్ని ఎగురువేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా బుద్ధ మిషన్ వార్షికోత్సవం



పలు పోటీల్లో విజేతలుగా నిలిచిన చిన్నారులతో ప్రసాద్, తదితరులు

**ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 13:** స్టీల్‌ప్లాంట్ బుద్ధ మిషన్ 31వ వార్షికో త్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్లాంటులోని బుద్ధ విహార్ వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి డైరెక్టర్ (కమర్షియల్) జీవీఎన్ ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 31 ఏళ్లుగా బుద్ధ మిషన్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. బుద్ధిని బోధనలను అమలు చేయడంతో మిషన్ చేపట్టే చర్యలకు తాము పూర్తి సహకారాన్ని అందిస్తా మన్నారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై నిర్వహించిన పోటీ పరీ క్షల్లోని విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం మిషన్ ప్రారంభా నికి కృషి చేసిన సర్వేశ్వరరావు, బాలభాస్కరరావు, పరంధామయ్య, సూర్యారావు లను సత్కరించారు. కార్యక్రమంలో మిషన్ ప్రధాన కార్యదర్శి పి.సత్యనారా యణ, ప్రతినిధులు ఎం.శ్రీనివాసరావు, పి.పెంటారావు, తదితరులు పాల్గొన్నారు.

## ఆక్రమిత స్థలాన్ని పరిశీలించిన తహసీల్దార్

**వేపగుంట, ఆగస్టు 13:** నాయుడుతోట గంగిరెడ్డి కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం అవసరాల కోసం కేటాయించిన స్థలం ఆక్రమణలపై పెందుర్తి తహసీల్దార్ వేణుగోపాల్ విచారణ చేపట్టారు. ఇక్కడి సర్వే నంబర్-75లో ఎరుకులు, జంగాల వారికి ఇళ్ల పట్టాలివ్వడం జరిగింది. కాలనీ అవసరాలకు అనుగుణంగా ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు ఉపయోగపడేలా వంటశాల ఏర్పాటు కోసం 300 గజాల స్థలాన్ని కేటాయించారు. అయితే ఏడాదిన్నరగా ఈ స్థలాన్ని పలువురు ఆక్రమించేందుకు యత్నించగా అడ్డుకో వడం జరిగింది. దీంతో ఈ స్థలంపై హైకోర్టులో కేసు వేయడంతో దీనిపై ఆరు వారాల్లో విచారణ చేపట్టి నివేదిక అందజేయాలని పేర్కొనడంతో తహసీల్దార్ ఇక్కడి జంగాలు, ఎరుకుల కులస్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరలో నివేదిక కోర్టుకు సమర్పిస్తానని ఆయన పేర్కొన్నారు.

## స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కేంద్రం కృషి చేయాలి

### ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు రామస్వామి



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న యు.రామస్వామి

**కూర్మన్నపాలెం, ఆగస్టు 13:** స్టీల్‌ప్లాంట్ ఇక్కట్లను తొలగించేందుకు, కర్మాగారాన్ని పరిరక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు యు.రామస్వామి కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1,279వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు ఊపిరిని ఆపాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం యోచి స్తుంటే కూటమి నాయకులు చోద్యం చూడడం తగదన్నారు. ఎందరో ప్రాణ త్యాగాలతో ఏర్పడిన స్టీల్‌ప్లాంటుకు అన్యాయం చేస్తే సహించబోమన్నారు. సార్వత్రిక ఎన్నికల ముందు రాష్ట్ర నాయకులు ఇచ్చిన మాటకు నిలబడి త్వరిత గతిన విశాఖ ఉక్కును కాపాడాలన్నారు. పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారా యణ మాట్లాడుతూ కర్మాగార పరిస్థితి రోజురోజుకూ అగమ్యగోచరంగా మారు తుండటంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు అన్యాయం జరిగితే చేటుచేసుకునే పరిణామాలకు ఉక్కు అధికా రులు, ప్రభుత్వ పాలకులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేస్తామని కేంద్రం స్పష్టమైన ప్రకటన చేసేంత వరకు పోరాటాలను మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు అయోధ్యరామ్, కేఎస్ఎన్‌రావు, వరసాల శ్రీనివాసరావు, గంగవరం గోపి, వి.ప్ర సాద్, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి లోకేశ్ దృష్టికి సమస్యలు



మంత్రి నారా లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందచేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

సీతమ్మధార, ఆగస్టు 13: ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే, బీజేపీ ఫ్లోర్ లీడర్ పి.విష్ణుకుమార్ రాజు విజయవాడలో విద్యా, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను వివరించారు. విద్యార్థులకు గత వైసీపీ పాలన నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ సక్రమంగా విడుదల కావడలేదన్నారు. దీంతో విద్యార్థులపై సర్టిఫికెట్లు ఇవ్వకుండా కళాశాల యాజమాన్యాలు ఒత్తిడి తీసుకువస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి స్పందించి ఫీజు విడుదలపై చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కాలేజీల్లో మౌలిక సదుపాయాలు ఉండేటట్లు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. దీనిపై సానుకులంగా స్పందించిన లోకేష్ పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు.

## హ్యాండ్ బాల్ టోర్నీకి విద్యార్థినుల ఎంపిక



ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయుడు

పూర్ణామార్కెట్, ఆగస్టు 13: వన్‌టౌన్‌లోని క్వీన్ మేరీ బాలిక పాఠశాల విద్యార్థినులు 17,18 తేదీల్లో అనంతపురంలో జరగనున్న హ్యాండ్‌బాల్ పోటీలో ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు వి.జోగేంద్రనాథ్ తెలిపారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థినులను అభినందించారు. పాఠశాలలోని నిహారిక, భార్గవి, అను, లహరి, మానస, జాస్మిన్, అస్మిత, సౌజన్య ఈ టోర్నీలో పాల్గొననున్నట్టు చెప్పారు.

## ఆల్ ఫ్రెడ్ హిచ్‌కాక్ గొప్ప సినీ దర్శకుడు



హిచ్‌కాక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

సీతంపేట, ఆగస్టు 13: ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ప్రపంచ సినీ దర్శకుడు ఆల్ ఫ్రెడ్ హిచ్‌కాక్ 125వ జయంతి వేడుకలను వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. హిచ్ కాక్ చిత్రపటానికి నరవ ప్రకాశరావు, భరణికాన రామారావు, ఎస్‌కె మిస్రో తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిచ్‌కాక్ అప్పట్లో సాంకేతిక పరిజ్ఞానం లేని రోజుల్లోనే ఎంతో మంచి సినిమాలు అందించారన్నారు. అందుకే ఆయనను మాస్టర్ ఆఫ్ సస్పెన్స్ అని పేరు గాంచారన్నారు. కార్యక్రమంలో భాగంగా ది బర్డ్స్ ఇంగ్లీస్ చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో బి. చిన్నారావు, హుస్సేన్, చాట్ల బాబురావు రెడ్డి, ఎంవీవీ గుప్త, అరుణ, తదితరులు పాల్గొన్నారు.





ఉమెన్స్ కాలేజీ విద్యార్థినుల ర్యాలీ..



జాతీయ జెండాతో బుల్లయ్య కళాశాల విద్యార్థులు

# వాడవాడలా హర్ ఘర్ తిరంగా ర్యాలీలు

అక్కయ్యపాలెం, ఆగస్టు 13: గ్రేటర్ 42వ వార్డు బీజేపీ అధ్యక్షుడు గురుగోవింద్ సింగ్, జగన్నాథపురంలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.ఆశాదేవి సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులు నలభై అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కన్వీనర్ అత్తిలి శంకరరావు, సీనియర్ నాయకులు రాజగిరి కృష్ణ, అరుణ పాల్గొన్నారు.

### జాతీయ జెండా ఊరేగింపు

సీతమ్మధార: ఇండిపెండెన్స్ డే సందర్భంగా డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల విద్యార్థులు తిరంగ రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 75 మీటర్ల జాతీయ జెండాతో కళాశాల ఎన్‌సీసీ, నేవీ, ఆర్మీ వింగ్‌లకు చెందిన విద్యార్థులు కళాశాల నుంచి సిరిపురం మీదుగా కాంప్లెక్సు గాంధీ విగ్రహం అక్కడి నుంచి కళాశాలకు చేరుకున్నారు. ఈ కార్యక్రమలో అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### వాల్తేరు రైల్వేలో...

విశాఖపట్నం: వాల్తేరు రైల్వేలో మంగళవారం హర్ ఘర్ తిరంగ కార్యక్రమం చేపట్టారు. మూడు రోజులపాటు నిర్వహించనున్న ఈ వేడుకలలో భాగంగా రైల్వే కాలనీలో ఇళ్ల వద్ద జాతీయ జెండాను ప్రదర్శించడంపై అవగాహన కల్పిస్తున్నారు. దేశభక్తి స్ఫూర్తి ప్రతిబింబించేలా డివిజన్‌లోని అన్ని స్టేషన్ల భవనాలు, కార్యాలయాలతోపాటు లోకో మోటివ్‌లు మూడు రంగుల లైట్లతో ప్రకాశించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఇక దేశ విభజన సమయంలో జరిగిన విషాదం, ఇతర సంఘటనలకు సంబంధించి వివిధ స్టేషన్లలో ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు.

విశాఖపట్నం (స్పోర్ట్సు): ప్రభుత్వ మహిళా కళాశాలలో మంగళవారం హర్ ఘర్ తిరంగ కార్యక్రమం నిర్వహించారు. కాలేజీ క్రీడా విభాగం, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ యూనిట్స్, కల్చరల్ కమిటి సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టనెంట్ డాక్టర్ కే గీతాంజలి , క్రీడా విభాగాధిపతి డాక్టర్ ఆర్.కిరణ్మయి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ బి.హైమావతి, డాక్టర్ జే లావణ్య పాల్గొన్నారు.

మాధవధార: మాధవధార, మురళీనగర్‌లలో టీడీపీ, బీజేపీ వార్డు అధ్యక్షులు ఎస్.వరప్రసాద్, కె.వెంకటరావు, ఎస్.రామకృష్ణ, ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని జీవీఎంసీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు అల్లుడు సునీల్ అగర్వాల్, కూటమి నాయకులు పాల్గొన్నారు.



మాధవధారలో ర్యాలీ నిర్వహిస్తున్న కూటమి నాయకులు



అక్కయ్యపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

## పర్యావరణాన్ని పరిరక్షించాలి



మాట్లాడుతున్న ఆచార్యులు ఎస్‌బీపీ రంగాచార్యులు

సీతంపేట, ఆగస్టు 13: ప్రజల్లో పర్యావరణ స్పృహను కల్పించాలని పర్యావరణ పరిరక్షణ సమితి సంయోజకులు, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆచార్యులు ఎస్‌పీబీ రంగాచార్యులు తెలిపారు. ద్వారకానగర్‌లోని బీవీకే కళాశాలలో భారతీయ శిక్షణ మండల్ నిర్వహణలో పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై ప్రసంగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాన వక్తగా విచ్చేసిన రంగాచార్యులు మాట్లాడుతూ ప్లాస్టిక్, పాలిథిన్‌లతో కలుగుతున్న ప్రమాదాన్ని ప్రచారం చేయాలన్నారు. సోలార్, బయో గ్యాస్ తదితర ఇంధన వనరులను ఉపయోగించుకోవాలన్నారు. సభలో పీఎస్ కుమార్, డాక్టర్ డీవీ సూర్యారావు, డాక్టర్ జీవీఎస్ఎన్ మూర్తి, కొత్తూరు రమణ, తదితరులు పాల్గొన్నారు.

## కెమికల్ విద్యార్థులకు భద్రతా చట్టాలపై అవగాహన



విద్యార్థినితో మాట్లాడుతున్న డా.నాగేశ్వరరావు

కంచరపాలెం, ఆగస్టు 13 : కెమికల్ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులు భద్రతా చట్టాలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని గాయత్రి కళాశాల ప్రొఫెసర్ డాక్టరు సీవీ నాగేశ్వరరావు సూచించారు. మంగళవారం కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమల్లో భద్రతా నియమాలు, చట్టాలను విద్యార్థులకు వివరించారు. అలాగే, గతంలో వివిధ పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాలను వివరించారు.ప్లాస్టింగ్స్ &పాలీమర్స్ కోర్సు అభ్యర్థుల అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ అధ్యక్షతన జరిగిన ఈ సెమినార్‌లో సీనియర్ అధ్యాపకులు నాగవెంకటకుమారి, రామాంజనేయులు, అధ్యాపకులుపాల్గొన్నారు.

## సమరయోధులను స్ఫూర్తిగా తీసుకోవాలి: కలెక్టర్

మహారాణిపేట, ఆగస్టు 13: స్వాతంత్ర్య సాధన కోసం ఎన్నో త్యాగాలు చేసిన వారిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ నెల 9వ తేదీనుంచి నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా మంగళవారం సాగరతీరంలో ర్యాలీ నిర్వహించారు. జిల్లాలోని వివిధ విభాగాల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, క్రీడాకారులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బారత మాతకి జై అంటూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు , పింగళి వెంకయ్య లాంటి మహనీయులు జీవితాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ పి సంపత్‌కుమార్ , జాయింట్ కమిషనర్ ఫకీరప్ప, ఆర్‌డీవో హుస్సేన్ సాహెబ్ అధికారులు జ్ఞానవేణి, డీడీ రామారావు , ఈడి శ్రీనివాసరావు జాన్‌గ్వాలియట్ పాల్గొన్నారు.

## ఆటల పోటీలు

అక్కయ్యపాలెం, ఆగస్టు 13 : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో పీడీ ఎ.సునంద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం ఆటల పోటీలు నిర్వహించారు. కబడ్డీ, క్రికెట్, రన్నింగ్, క్యారమ్స్, చెస్ తదితర పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలుగు ఉపాధ్యాయుడు ఎంవీ ధర్మారావు ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు జరిగాయి. విజేతలకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో బహుమతులు ప్రదానం చేయనున్నారు.

# రోగులతో కిటకిటలాడిన ఓపీ

- వైద్యులు లేక ఖాళీగా కుర్చీలు
- జూడోల సమ్మెతో కేజీహెచ్‌లో వైద్య సేవలకు అంతరాయం
- ఓపీ హాజరుకాని సీనియర్ వైద్యులు
- రోగుల తీవ్ర అవస్థలు



ఓపీ వద్ద రద్దీ



ఖాళీగా ఉన్న వైద్యుని కుర్చీ

మహారాణిపేట, ఆగస్టు 13: కోల్‌కతాలో వైద్య విద్యార్థిని హత్యాచారఘటనకు నిరసనగా మంగళవారం జూనియర్ వైద్యుల విధుల బహిష్కరణతో కేజీహెచ్‌లో ఓపీ సేవలకు తీవ్ర అంతరాయం కలిగింది. రోగులు తీవ్ర ఇబ్బందులకు లోనయ్యారు. సీజనల్ జ్వరాలతో అధిక శాతం మంది వచ్చారు. ఓపీ విభాగాలన్నీ కిటకిటలాడాయి. ప్రధానంగా అవుట్ పేషంట్ల విభాగంలో పీజీ వైద్యులతోనే రోగులకు వైద్య సేవలు అందిస్తారు. కోల్‌కతాలో వైద్య విద్యార్థిని ఆత్యాచారం చేసి హత్యకు పాల్పడిన ఘటనకు నిరసనగా జూనియర్ వైద్యుల సమ్మె కారణంగా విధులకు దూరంగా ఉన్నారు. ఈ విషయం తెలిసినా ఓపీలలో రోగులకు వైద్య సేవలకు అంతరాయం కలగకుండా ప్రధాన విభాగాలకు చెందిన హెచ్‌వోడీలు (విభాగాధిపతులకు) అందుకు తగిన చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు తలెత్తుతున్నాయి. రోజువారి యూనిట్లు ప్రకారం విధులకు హాజరుకావాల్సిన ప్రధాన వైద్యులైన ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసరు కూడా ఓపీ విధులకు హాజరుకాకపోవటంతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆర్థోపెడిక్, మెడికల్, సర్జికల్, న్యూరో, గ్యాస్ట్రో తదితర విభాగాల్లో కేవలం ఒక్కో వైద్యుడితో రోగులకు సేవలు పరిమితం చేశారు. దీంతో రోగులు మధ్యాహ్నం వరకు బారులు తీరి కనిపించారు. ఆసుపత్రి అధికారులు సైతం జూనియర్ వైద్యుల సమ్మెతో తలెత్తే సమస్యలకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడంపై రోగులు అసహనం వ్యక్తం చేశారు. జూనియర్ వైద్యులు హత్యాచార నిందితులకు అరెస్టు చేసే వరకు నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరిస్తున్నారు. ఈనేపథ్యంలో రోగులకు ఇబ్బందులేకుండా కేజీహెచ్‌లో వైద్య సేవలందేలా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు

## అత్యంత ప్రతిష్టాత్మకంగా 'వారధి'

- నార్త్ బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

సీతమ్మధార, ఆగస్టు 13: ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి వారధి అనే అత్యంత ప్రతిష్టాత్మకమైన కార్యక్రమాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్టు దక్షిణ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే, ఫ్లోర్ లీడర్ విష్ణుకుమార్ రాజు తెలిపారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం రోజున విజయవాడలో కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి చేతుల మీదుగా ఈ కార్య క్రమం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్ర రాష్ట్ర యూనిట్ మొత్తం కలిసి విజయవాడలో ఆదివారం తప్పా మిగిలిన రోజుల్లో ఈ కార్యాలయంలో అందుబాటులో ఉంటూ ఎమ్మెల్యేలేదా మంత్రుల ఆధ్వర్యంలో ప్రజల సమస్యలపై వినతి పత్రాలు స్వీకరిస్తామన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కారిస్తామన్నారు. బీజేపీ ప్రజా ప్రతినిధులు రోజుకు ఒక్కరు చొప్పున కార్యాలయంలో అందుబాటులో ఉంటారని తెలిపారు.

## తంగలాన్ చిత్రం ఆదరించాలి

- సినీ హీరో విక్రమ్
- విశాఖలో సందడి చేసిన యూనిట్



సమావేశంలో హీరోహీరోయిన్ విక్రమ్, మాళవిక మోహనన్ తదితరులు

సాగర్‌నగర్, ఆగస్టు 13: తంగలాన్ చిత్రానికి తెలుగు ప్రేక్షకులు అఖండ విజయం అందించాలని సినీ హీరో విక్రమ్ అన్నారు. తంగలాన్ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా హీరోయిన్ మాళవిక మోహనన్, నిర్మాత జ్ఞానవేల్ రాజాతో కలిసి మంగళవారం సాగర్‌నగర్ సమీపంలోని రాడిసన్‌బ్లూ రిసార్ట్స్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో విక్రమ్ మాట్లాడుతూ.. ఈ చిత్రం నిర్మాణ సమయంలో యూనిట్ ఎంతో శ్రమించినట్టు చెప్పారు. మేకప్ కోసం గంటల సమయం వెచ్చించాల్సి వచ్చేదన్నారు. కఠినతరమైన పాత్రలు పోషించడం, అడ్వంచర్స్ సృష్టించడం అంటే తనకు ఇష్టమన్నారు. తెలుగు రాష్ట్రాల ప్రజలు తనను ఎంతగానో ఆదరించారన్నారు. ఈ చిత్రం ఈనెల 15వ తేదీన విడుదల కానున్న నేపథ్యంలో ప్రచారం చేస్తున్నట్టు తెలిపారు. స్వాతంత్ర్యానికి పూర్వం కోలార్ గోల్డ్ ఫీల్డ్స్‌లో జరిగిన వాస్తవ సంఘటనలను ఆధారం చేసుకుని ఈ చిత్రం తెరకెక్కించామన్నారు. విశాఖ ప్రకృతి అందాలకు నిలయమని అన్నారు. తెలుగు, తమిళభాషల్లో విడుదల చేయనున్నామన్నారు. 2022లో ప్రారంభమైన ఈ చిత్ర నిర్మాణం చెన్నై, హైదరాబాద్, మధురై, కర్ణాటక సహా పలు లొకేషన్లలో చిత్రీకరించారు. ఈ చిత్రం ట్రైలర్ విడుదలై ఇప్పటికే అలరిస్తోందన్నారు. ఈ పాన్ ఇండియా సినిమాని పా. రంజిత్ తెరకెక్కించారు. నీలం ప్రొడక్షన్స్, స్టూడియో గ్రీన్, జియో స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించారు. పార్వతీ తిరువోతు, మాళవిక మోహనన్, పశుపతి తదితరులు ముఖ్యపాత్రలు పోషించారు. సంగీతం జి.వి. ప్రకాశ్‌కుమార్, ఛాయాగ్రహణం ఎ. కిశోర్‌కుమార్ సమకూర్చారు. చిత్రంలో విక్రమ్ డిఫరెంట్ రోల్‌లో కనిపించనున్నారు. కథానాయిక మాళవిక మోహనన్, మరో నటుడు డానియల్ చిత్రానికి సంబంధించి వారి అనుభవాలను పంచుకున్నారు.

## ఆటోనగర్ నిర్మాణం జరిగేలా చూడండి




మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు రాజు

జగదాంబ కూడలి, ఆగస్టు 3: నగర శివారు కణమాంలో ఆటో నగర్ నిర్మాణాన్ని ఏపీఐఐసీతో ఒప్పందం మేరకే పూర్తిచేయాలని, దీని వల్లే కార్మికులకు న్యాయం చేకూరుతుందని సీఐటీ యూ నాయకుడు వై. రాజు అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కణమాంలో ఆటోనగర్ నిర్మాణాన్ని ఎంఎస్ఎంఈ పార్కు సంస్థకు అప్పగిస్తున్నట్లు ప్రచారం జరుగుతుందని, ఈ యోచన తక్షణం నిలుపు చేయాలన్నారు. ఆటోనగర్ కోసం తీసుకున్న భూములకు చెల్లించాల్సి నష్టపరిహారం కొంతమంది రైతులకు ఇవ్వలేదన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఆటోనగర్ నిర్మాణం కోసం భూములు కేటాయించడం జరిగిందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోలేదని విమర్శించారు. ఇప్పటికైనా కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో కార్మికలు, సిఐటియు నాచకులు పాల్గొన్నారు.

## మాజీమంత్రి శివశంకర్ చిరస్మరణీయులు

డాబాగార్డెన్స్, ఆగస్టు 13 : కేంద్ర న్యాయశాఖ మంత్రి, దివంగత నేత పి.శివశంకర్ దేశానికి ఎనలేని సేవలు చేశారని పలువురు వక్తలు కొనియాడారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో అప్తా ఆధ్వర్యంలో శివశంకర్ జయంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమర్జెన్సీ సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆయన దేశానికి ఎనలేని సేవలందించారని గుర్తుచేశారు. శివశంకర్‌కు సమాజంపై ఎంతో నిబద్ధత ఉండేదని, వ్యత్యాసాలను రూపుమాపేందుకు న్యాయపరమైన అంశాలపై ఆయన ఎల్లప్పుడూ పోరాడేవారన్నారు. కులమతాలకతీతంగా న్యాయమూర్తులను ఎంపిక చేసి ఆయన పేరుగాంచారన్నారు. అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ ఆప్తా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి న్యాయవాదిఆ గేదెల కిషోర్ సభాధ్యక్షులుగా వ్యవహరించారు. ముఖ్య అతిథిగా సీనియర్ న్యాయవాది కేవీ రామ్మూర్తి, మాజీ మెట్రో పాలిటన్ స్పెషల్ మెజిస్ట్రేట్ టీవీ రమణ, ఏపీ స్టేట్ బార్ అసోసియేషన్ వైస్ ఛైర్మన్ కీర్తి రామజోగేశ్వరరావు, జిల్లా బార్ అసోసియేషన్ సెక్రటరీదంతనరేష్‌కుమార్ హాజరయ్యారు. ఆప్తా సంఘం అప్పికొండ కాత్యాయని చిక్కాల జగదీశ్వరి, ఎ.దొరబాబు, డా.వసంతరాజేంద్రప్రసాద్, రాకేష్, పతివాడ విద్యాసాగర్, ఆప్తా కో ఆర్డినేటర్ బావిశెట్టి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదమేనా..?

... 5వ పేజీ తరువాయి

రూపకల్పన చేయడంతో ఆ స్థలం లీజుని కొన్నాళ్ల కిందట జీవీఎంసీ రద్దుచేసి, స్థలాన్ని స్వాధీనం చేసుకుంది. దీనిపై సంస్థ కోర్టును ఆశ్రయించింది. బీచ్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు పనులు ప్రారంభించినపుడు తాము స్వచ్ఛందంగా స్థలాన్ని అప్పగిస్తామని, అప్పటివరకు మార్కెట్ ధర ప్రకారం లీజుకు ఇవ్వాలని కోర్టును కోరింది. దీనికి జీవీఎంసీ కూడా సమ్మతించడంతో కేసు ఉపసంహరించుకున్నారు. తర్వాత జీవీఎంసీ 419 గజాల స్థలాన్ని తిరిగి సిల్వర్‌స్పూన్ సంస్థకు లీజు ప్రాతిపదికన కేటాయించింది. ఈ గడువు వచ్చే ఏడాది మే వరకూ ఉంది.

ఇదిలా ఉండగా జీవీఎంసీ లీజుకు కేటాయించిన 419 గజాల స్థలం పోగా మిగిలిన 1,831 గజాల స్థలం కూడా అనధికారికంగా ఆక్రమించుకుని వ్యాపారం సాగిస్తున్నారని చాలా మంది జీవీఎంసీకి ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ గత ప్రభుత్వంలోని పెద్దల ఒత్తిడితో అధికారులు పట్టించుకోలేదు. తాజాగా జిల్లలోని జనసేన నేతకు చెందిన బంధువు ఆ స్థలంపై కన్నేశారు. సిల్వర్‌స్పూన్‌కు కేటాయించిన 419 గజాలు మినహాయించి, మిగిలిన స్థలాన్ని లీజు పేరుతో చేజిక్కించుకునేందుకు కొద్ది రోజులుగా ప్రయత్నాలు ప్రారంభించారు. ఇందులో భాగంగా ఇటీవల జీవీఎంసీ అధికారులను కూడా కలిసి, దీనిపై చర్చించినట్టు తెలిసింది. అయితే ఆస్థలంలో ఇప్పటికే కొన్ని దుకాణాలు, ఇతర ఆక్రమణలు ఉన్నందున వాటిని తొలగించాలంటే పైస్థాయి నుంచి ఆదేశాలు రావాలని, ఖాళీ స్థలమైతే లీజుకు ఇచ్చేస్తామని అధికారులు తేల్చినట్టు సమాచారం. ఇదిలా ఉండగా ఆక్వాస్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు ముందువైపు బీచ్‌రోడ్డును ఆనుకుని ఉన్న ఐస్‌క్రీమ్ దుకాణం రిజర్వేషన్ కేటగిరీలో ఒక మహిళ వేలంలో దక్కించుకున్నారు. ఆ దుకాణాన్ని కూడా ఈ జనసేన నేత బంధువే చేజిక్కించుకున్నట్టు తెలిసింది. రిజర్వేషన్ కేటగిరీ కావడంతో ఆమె పేరుతో లీజు ఉన్నప్పటికీ, దుకాణం తన ఆధీనంలోనే ఉంచుకున్నట్టు సమాచారం. ఈ తరుణంలోనే సిల్వర్‌స్పూన్ రెస్టారెంట్‌ను ఆనుకుని ఉన్న డైనోపార్కులో సందర్శకులు లేని సమయంలోనే అగ్నిప్రమాదం జరగడం పలు అనుమానాలకు దారితీసింది. ఈ స్థలాన్ని చేజిక్కించుకునేందుకు జనసేన నేత బంధువే ప్రమాదం సృష్టించి ఉంటారని అనుమానిస్తున్నారు. ఈ విషయాన్ని త్రీటౌన్ సీఐ వద్ద ప్రస్తావించగా, దర్యాప్తులో అన్ని విషయాలు బయటపడతాయన్నారు.

# మన రిజర్వాయర్లు భద్రమేనా..!

... 5వ పేజీ తరువాయి

మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌లో నీటిని జీవీఎంసీ అవసరాలకు వినియోగిస్తున్నారు. వాడుకునే నీటికి జీవీఎంసీ సొమ్ములు చెల్లించడంలేదు.. చివరకు నీటి పారుదల శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదించినా నిధులు విడుదలచేయడంలేదు. రిజర్వాయర్‌కు ఉన్న ఆరు గేట్లలో ఒకటి, ఐదోగేటు పూర్తిగా మొరాయించాయి. వరద వచ్చినపుడు రెండు, మూడు, నాలుగు, ఆరోగేటు పైకి ఎత్తి నీటిని విడిచిపెడుతున్నారు. మరిన్ని గేట్లకు సంబంధించిన బోల్టులు ఊడిపోయి కిందకు జారిపోవడంతో వరదల సమయంలో పైకి ఎత్తే క్రమంలో మొరాయించే ప్రమాదం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రతి ఏటా గేట్లకు గ్రీజు రాయడం, పెయింటింగ్ వేయడం చేయాల్సి ఉంటుంది. అయితే గడచిన ఐదేళ్లలో జీవీఎంసీ కేవలం రూ.రెండు లక్షలు మంజూరుచేసింది. కూటమి ప్రభుత్వం అధికారంచేపట్టిన తరువాత ప్రాజెక్టుల మరమ్మతులు చేపట్టాలని జలవనరుల శాఖా మంత్రి ఆదేశాలతో మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ గేట్లు తక్షణ మరమ్మతులకు రూ.4 కోట్లతో ప్రపాదించారు. మొరాయించిన 1, 5 గేటును యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ప్రతిపాదనలో పేర్కొన్నారు. రిజర్వాయర్‌లో నీరుండడంతో ఈ ఏడాది పూర్తిగా మరమ్మతులు చేయడం సాధ్యంకాదని అధికారులు భావిస్తున్నారు. అయితే వరదలు వచ్చినపుడు ఇబ్బందిలేకుండా ఒకటి, ఐదోగేటు పైకిలేచేలా కొంతవరకు మరమ్మతులకు అవకాశం ఉందని, ఇందుకు నిధులు అవసరమని చెబుతున్నారు. ఈ మేరకు ప్రతిపాదించిన అధికారులు, జీవీఎంసీ బకాయిల నుంచి తక్షణం రూ.3.205 కోట్లు విడుదలచేస్తే ఈ ఏడాది వర్షాకాలం ఇబ్బందులు అధిగమించవచ్చునని ప్రతిపాదించారు.

# అర్ధరాత్రి సర్దేశారు!

... 5వ పేజీ తరువాయి

విశ్వసనీయ సమాచారం. వాటిని పూర్తిచేస్తే భారీగా నజరానా అందుతుందని అధికారికి ఆశ చూపించాడని చెబుతున్నారు.

### రెండేళ్ల వరకు పెండింగ్‌లోనే

బి.తాళ్లవలస ఇనాము భూములను రైతుల నుంచి ఇతరుల పేర్ల మీదకు రిజిస్ట్రేషన్ చేయడానికి జూన్ 2022లో భీమిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దశలవారీగా 38 డాక్యుమెంట్లు పెట్టారు. అవి ఇనాము భూములు కాబట్టి, రిజిస్ట్రేషన్ చేయలేమని తిరస్కరించాలి. కానీ ఈ అధికారి పెండింగ్ రిజిస్ట్రేషన్ చేశారు. సదరు భూములు 1-బి రికార్డుల్లో ఉన్నా ఆన్‌లైన్‌లో తహసీల్దార్ డిజిటల్ సంతకం లేదని గుర్తించారు. దీంతో అవి వెనక్కి పంపాలి. కానీ వారితో మంతనాలు జరిపారు. తాము ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి, తహసీల్దార్ సంతకం చేయిస్తామని, అంతవరకు డాక్యుమెంట్లు పెండింగ్‌లోనే ఉంచాలని వారు కోరడంతో రెండేళ్లకు పైగా వాటిని అలాగే ఉంచారు. మధ్యలో ఆ శాఖ ఉన్నతాధికారులు గుర్తించి, వాటిని వెనక్కి ఇవ్వాలని సూచించినా సబ్ రిజిస్ట్రార్ లెక్క చేయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ భూములపై ఆరా తీయగా ఈ విషయం బయటపడింది. ఇప్పుడైనా వాటిని తిరస్కరించకపోతే పీకల మీదకు వస్తుందని ఉన్నతాధికారులు హెచ్చరించడంతో పది రోజుల క్రితం ఆ అధికారి వాటిని తిరస్కరించారు. ఈ వ్యవహారం మొత్తం ఐజీకి తెలియడంతో ఆగమేఘాలపై వివరణ కోరి, సస్పెన్షన్‌కు ఆదేశాలిచ్చారు. అయితే అధికారులను లోబరుచుకొని, తప్పుడు పనులు చేయించే డాక్యుమెంట్ రైటర్లపైనా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

# రాజకీయ విలువలకు కట్టుబడే....

... 5వ పేజీ తరువాయి

సాగాలనే ఉద్దేశంతోనే బరి నుంచి తప్పుకున్నట్టు పల్లా వివరించారు.

### ముగిసిన నామినేషన్ల గడువు

విశాఖపట్నం: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు నామినేషన్ల గడువు మంగళవారం సాయంత్రంతో ముగిసింది. కూటమి నుంచి ఎవరినీ పోటీకి దింపడం లేదని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రకటించారు. స్వతంత్ర అభ్యర్థులు కూడా నామినేషన్లు వేయలేదు. వైసీపీ తరపున బొత్స సత్యనారాయణ, స్వతంత్ర అభ్యర్థిగా మరో వ్యక్తి సోమవారం సమర్పించిన నామినేషన్లే మిగిలాయి. వీటిని బుధవారం పరిశీలిస్తారు.

## 'సర్దుబాటులో దివ్యాంగులకు అన్యాయం'

**భీమునిపట్నం (రూరల్), ఆగస్టు 13:** రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న టీచర్ల పనిసర్దుబాటులో దివ్యాంగ ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతోందని సంఘం ప్రధాన కార్యదర్శి ఎ.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులలో వందశాతం కంటిచూపు లోపం ఉన్న వాళ్లను మాత్రం పని సర్దుబాటు నుంచి మినహాయింపు ఇచ్చినట్టు పేర్కొన్నారు. శారీరక వైకల్యం కలిగినవాళ్లు, వినికిడి లోపంతో బాధపడుతున్న వారికి ప్రభుత్వ మార్గదర్శకాలతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు ఉత్తర్వులు జారీ సమయంలో దివ్యాంగ సంఘాలతో చర్చించాల్సి ఉందన్నారు.

## ఖరీఫ్ సాగుపై పొలంబడి

**పద్మనాభం, ఆగస్టు 13:** మండలంలోని పాండ్రంగి గ్రామంలో ఖరీఫ్ రైతులకు ఏవో ఎంపీఎస్ చలం ఆధ్వర్యంలో మంగళవారం పొలం బడి నిర్వహించారు. ఈ సందర్భంగా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించడం, ఎరువులు, పురుగు మందుల యాజమాన్యంలో మెలకువలు, కలుపు నివారణలో తీసుకోవలసిన జాగ్రత్తలు తదితరవాటిని వివరించారు. 50 శాతం రాయితీపై సూడోమోనాస్ వి త్తన శుద్ధి మందును పంపిణీ చేశారు. ఎంపీఈఓ రమ తదితరులు పాల్గొన్నారు.

### కోరాడలో అవగాహన

కోరాడ గ్రామంలో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు వరిపంటలో సాగు మెలకువలపై వ్యవసాయశాఖ ఏడీ సీహెచ్ సుబ్రహ్మణ్యం మంగళవారం అవగాహన కల్పించారు. వరినాట్లు వేసిన మూడు రోజుల తరువాత ప్రీటలాక్లోర్ మందును 500ఎంఎల్ మందును 25 కిలోల ఇసుకతో కలిపి పిచికారీ చేయడంతో కలుపు నివారణ చేయవచ్చన్నారు. పొలంలో కాలిబాటలు తీసుకోవాలన్నారు. దమ్ములో బస్తా డీఏపీని పొటాష్ 20 కిలోలు వేయాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి కె.అప్పలస్వామి, ఏఓ చలం, సురేష్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు శ్రీను, ఆదర్శ రైతులు రామకృష్ణ, కాంతారావు, వివిఏ షామిలి తదితరులు పాల్గొన్నారు.

## అవయవదానంపై అవగాహన

**తగరపువలస, ఆగస్టు 13:** తగరపువలస బంగ్లామెట్ట పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు అవయవదానంపై ఉపాధ్యాయులు అవగాహన కలిగించారు. అవయవదానంతో మరొకరికి ప్రాణదానం చేసినట్లవుతుందని హెచ్ఎం అప్పలరాజు వివరించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం రేపు

**పెదవాల్తేరు, ఆగస్టు 13:** స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 15న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు మినిస్ట్రీ ఆఫ్ హోలీవే వ్యవస్థాపకులు డాక్టర్ సత్యానంద్ కుమార్ తెలిపారు. ఎస్ఆర్ ఆసుపత్రి సహకారంతో ఎంవీపీ పోలీసు స్టేషన్ ఎదురుగా ఉన్న హోలీ టవర్‌లో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు శిబిరాన్ని ప్రారంభిస్తారన్నారు.

## విద్యార్థులకు పోటీలు

**రామ్‌నగర్, ఆగస్టు 13:** స్థిత ప్రజ్ఞ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, పబ్లిక్ స్పీచ్, క్విజ్, వ్యాసరచన, ఫైర్‌లెస్ కుకింగ్, పాటలు, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలను నిర్వహించారు. మంగళవారం బీచ్‌రోడ్డులోని పాండురంగస్వామి ఆలయం సమీపంలో నిర్వహించిన పోటీలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఇన్‌కం ట్యాక్స్ డిప్యూటీ కమిషనర్ మధుసూదనరావు విజేతలకు బహుమతులు అందించారు. ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ వైవీవీ సత్యనారాయణ, ఏయూ అధికారి సూర్యారావు , కొప్పు చిరంజీవిరావు, ఎం. చిన్నయ్యదొర, కె. సునీత, లావణ్య, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య వేడుకలకు ముగ్గురు గురుకుల విద్యార్థులు

**సింహాచలం, ఆగస్టు 13:** ఈనెల 15న దేశరాజధాని న్యూఢిల్లీలో జరగనున్న 77వ స్వాతంత్ర్య వేడుకలకు సింహాచలం గురుకుల పాఠశాలలోని ముగ్గురు విద్యార్థులకు ఆహ్వానం అందిందని ప్రిన్సిపాల్ దాసరి సత్యారావు తెలిపారు. నీతి ఆయోగ్‌లోని అటల్ ఇన్నోవేషన్ మిషన్ డైరెక్టర్ డా.చింతన్ వైష్ణవ్ నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు. పదో తరగతి విద్యార్థులు రెడ్డి గణేష్, గుడెన లజపతిరాయ్, లబ్బ సోమశేఖర్ వేడుకలకు హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

## సినిమా గైడ్

- **కమిటీ కుర్రోళ్ళు :** శరత్, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), మోహిని (గాజువాక),
- **తుఫాన్ :** జగదాంబ, కిన్నెర, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-1 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ).
- **భవనమ్ :** మెలోడి, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మి (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి),
- **సింబా :** జగదాంబ, కామేశ్వరి, మోహిని (గాజువాక)
- **సూపర్‌డీలక్స్ :** జగదాంబ, మోహిని (గాజువాక)
- **సంఘర్షణ :** క్రాంతి
- **బడ్డీ :** సౌజన్య (గోపాలపట్నం), గణేష్ (తగరపువలస)
- **శివం భజే :** లక్ష్మీకాంత్ (గాజువాక)
- **రాయన్ :** శారద, సంగం, శ్రీకన్య-2 (గాజువాక)
- **కల్కి :** శ్రీరామ, కన్య (గాజువాక), సప్తగిరి(తగరపువలస)

## రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 40, టమాటా 28, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 20, పచ్చిమిర్చి 55, కాకరకాయలు 42, బీరకాయలు 30, ఆనపకాయలు 16, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 26, క్యారెట్ 32, దొండకాయలు 34, బంగాళదుంపలు 36, అరటికాయ 8, మునక్కాడలు (కిలో) 46, అల్లం (పాతది) 140, బరబటి 30, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 82, గోరుచిక్కుడు 36, దోస కాయలు 20, వె ల్లుల్లి (పెద్దవి) 195, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 56, పొటల్స్ 34, కీరదోస 30, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 44, కంద 64, దేముడు చిక్కుడు 86, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

### కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

| | |
|---|---|
| విశాఖపట్నం | 490 |
| విజయనగరం | 494 |
| శ్రీకాకుళం | 494 |

### చికెన్ ధరలు

బ్యాగ్

| | |
|---|---|
| రైతు ధర | 75 |
| ఫారం ధర | 95 |
| విత్ స్కిన్ | 160 |
| స్కిన్‌లెస్ | 170 |

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..




భీమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హర్ ఘర్ తిరంగా ర్యాలీ పాల్గొన్న ముఖ్యఅతిథులు



పురవీధుల్లో 150 మీటర్ల జాతీయ పతాక రెపరెపలు

# జాతీయ భావం పెంపొందించాలి

**భీమునిపట్నం, ఆగస్టు 13:** జాతీయ భావం పెంపొందించేలా ప్రతి ఇంటి వద్దా జాతీయ పతాకాలు ఎగురవేయాలని వక్తలు పిలుపునిచ్చారు. భీమిలిలో మంగళవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, విశాఖ స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా చైతన్య కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉదయం పాఠశాల ప్రధానోపాధ్యాయులు పొన్నగంటి రమణ పర్యవేక్షణలో 150 మీటర్ల జాతీయ పతాకంతో జరిగిన ర్యాలీలో ఎం పీడీవో జానకి, ఎంఈవోలు ఎం.శివరాణి, ఎ. జయప్రద, ప్రభుత్వ జూనియరు కళాశాల ప్రిన్సిపాల్ సూర్య ప్రసాద్, సీఐ డి.రమేష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ భావాన్ని పెంపొందించేలా జాతీయ గీతాలు, నినాదాలతో పట్టణంలో ఈర్యాలీ సాగింది. ఈ సందర్భంగా, వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు సూరాడ అప్పారావు, పాఠశాల

**వాడవాడలా హర్ ఘర్ తిరంగా ర్యాలీ**

పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు మైలపల్లి షణ్ముఖరావు, మైలపల్లి లక్ష్మణరావు, కాళ్ల సన్నీ, పూసర్ల శ్రీనివాసరావు, దారపు అప్పారావు, మారోజు గోపి తదితరులు విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో స్వీట్లు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు సతీష్, సత్యవాణి, నానాజీ, సూర్యంనాయుడు, 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

**బీజేపీ ఆధ్వర్యంలో..**

**భీమునిపట్నం:** బీజేపీ నియోజకవర్గ కన్వీనరు కంటుభుక్త రామానాయుడు ఆధ్వర్యంలో గంటస్తంభం వద్ద హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి పుట్టా గంగయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా, పాఠశాలల విద్యార్థులతో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం, బైక్ ర్యాలీగా ఉప్పాడ వైపు పయనమయ్యారు. ఈ సందర్భంగా, వారు మాట్లాడుతూ దేశభక్తిని, జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి ధానేష్, నాయకులు పి.శ్రీనివాసరావు, శ్రీహరి, అనిల్‌కుమార్, కంటుభుక్త సునీత, పూళ్ల కొండబాబు, డిఆర్కే రాజు, పాలుబోతు విజయ, రేఖ కరుణారావు పాల్గొన్నారు.

**ఆనందపురంలో..**

**ఆనందపురం:** ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగ్ అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో అప్పలనాయుడు మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకుని ప్రతీ ఇంటిపైనా జాతీయ జెండా ఎగురవేయాలని కోరారు. ఆగస్టు 15న గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించాలని కార్యదర్శులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి రామారావు, కార్యదర్శులు పాల్గొన్నారు.



బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా యాత్ర



ఆనందపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీవో సిబ్బంది

## విశాఖ - భీమిలి బీచ్‌రోడ్డులో టూరిజం అభివృద్ధి

**రాజస్థాన్ పర్యాటక శాఖా మంత్రి దియా కుమారి**



దియా కుమారికి పుష్పగుచ్ఛం అందిస్తున్న గంటా శ్రీనివాసరావు

**భీమునిపట్నం, ఆగస్టు 13:** విశాఖ - భీమిలి బీచ్‌రోడ్‌లో టూరిజం అభివృద్ధికి అపారమైన అవకాశాలున్నట్టు రాజస్థాన్ డిప్యూటీ సీఎం, ఆ రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి దియా కుమారి అభిప్రాయం వ్యక్తంచేశారు. ఇటీవల జైపూర్‌లో జరిగిన ఓ శుభ కార్యానికి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తన స్నేహితులతో హాజరయ్యారు. ఈ సందర్భంగా, ఆదివారం అక్కడ ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె భీమిలి నియోజకవర్గంలో పర్యాటక పరంగా అవకాశాలపై మంత్రి దియాకుమారి గంటాను అడిగి తెలుసుకున్నారు. దేశంలోనే రెండవ మునిసిపాలిటీగా భీమిలికి చారిత్రక గుర్తింపు వుందని, చక్కనైన బీచ్, చారిత్రక కట్టడాలు, బౌద్ధారామాలు ఈ ప్రాంతంలో ఉన్నట్టు వివరించారు. ఈ సందర్భంగా భీమిలికి పర్యాటకంగా భవిష్యత్తు ఆమె అభి ప్రాయపడ్డారు. రాజస్థాన్ టూరిజం అభివృద్ధికి చెందిన అంశాలను మంత్రి దియా కుమారిప్రస్తావించారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆహ్వానంపై అవకాశం మేరకు విశాఖ సందర్శిస్తానని ఆమె హామీ ఇచ్చారు.

## వీఎంఆర్డీఏ కమిషనర్ పర్యటన

**విశాఖపట్నం, ఆగస్టు 13:** క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా వీఎంఆర్డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ మంగళవారం చినముసిడివాడలో నూతనంగా నిర్మిస్తున్న రెండంతస్థుల కల్యాణ మండపాన్ని పరిశీలించారు. సంస్థకు ఆదాయం పెంచేలా నిర్వహణా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సబ్బవరం నుంచి గుల్లేపల్లి వరకు రూ.5.71 కోట్లతో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను తిలకించారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను పక్కకు మార్చే పనులనువేగవంతం చేయాలన్నారు. అడ్డూరు, పైడివాడ అగ్రహారం, కోడూరు 1,2,3,4, లే అవుట్‌లలో మౌలిక వసతుల కల్పన పనులను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. అదేవిధంగా అనకాపల్లి రావుగోపాలరావు కళాక్షేత్రంలో జరుగుతున్న మరమ్మతులను, తుమ్మపాలలో సంస్థకు చెందిన భూములు పరిశీలించారు. ఆ తర్వాత అనకాపల్లి కలెక్టర్ విజయ్‌కృష్ణన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆర్‌సీ లేఅవుట్లపై చర్చించారు. ఆయన వెంట ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, ముఖ్య ప్రణాళికాధికారి సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజనీర్ భవానీశంకర్, ఇతర ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

## బోనంగి పండు పడాల్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న టీసీఅండ్‌టీమ్ డైరెక్టర్ మందరాణి

**సాగర్‌నగర్, ఆగస్టు 13:** గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ భవన్ రుషికొండలో ఆదివాసి విప్లవవీరుడు బోనంగి పండు పడాల్ జయంతి ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మంద రాణి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆమె మాట్లాడుతూ బ్రిటీష్ నిరంకుశ పాలనలో గిరిజనుల శ్రమ సంపద దోపిడీ, దారిద్ర్యం పారదోలడానికి మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుతో కలసి పడాల్ అనేక పోరాటాల్లో పాల్గొన్నారన్నారు. ఆయన త్యాగాలు మరవలేనివన్నారు. ఈ కార్యక్రమంలో టీసీఅండ్‌టీమ్ సభ్యులు తదితర్లు పాల్గొన్నారు.

## విద్యుత్ బిల్లుల పేరిట సైబర్ నేరగాళ్ల వల

**భీమునిపట్నం (రూరల్), ఆగస్టు 13:** సైబర్ నేరగాళ్లు విద్యుత్తు కనెక్షను తీసివేస్తున్నామని వాట్సాప్‌లో సమాచారమిచ్చి కొత్తమోసాలకు తెరలేపుతున్న నేపథ్యంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ అధికారులు కోరుతున్నారు. విద్యుత్ బకాయి చెల్లించి నందువల్ల మీ కనెక్షను ఈ రాత్రికి తొలగిస్తున్నట్టు.. మీరు కార్యాలయంలో సంప్రదించాలంటూ తొలుత ఓ నంబరు ఇస్తున్నారు. ఆ నంబరుకు ఫోన్ చేస్తే తెలుగు, హిందీ కలగలిపిన భాషలో ఎవరో మాట్లాడుతున్నారు. తాము అన్ని బిల్లులు సకాలంలో చెల్లించామని చెప్పగానే కా నీ మీ అకౌంటెంట్ డిఫాల్డర్‌గా కానుందని చెబుతున్నారు. వివరాలు కావాలని మీ బిల్లు స్టేటస్‌ను పరిశీలన పేరిట ఒక లింక్ ఇస్తున్నారు. ఈ లింక్‌నొక్కితే బ్యాంక్ ఖాతాలో డబ్బులు మొత్తం మాయమవుతున్న ట్టు సమాచారం. ఈ స్థితిలో విద్యుత్ శాఖ ఇటువంటి నోటీసులేవీ వాట్సాప్‌లో ఇవ్వడంలేదని... టెక్స్ట్ మెసేజ్ ద్వారా సమాచారం ఇస్తుందని విద్యుత్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఫేక్ కాల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని వినియోగదారులకు సూచించారు.

## భీమిలి సబ్ రిజిస్ట్రార్‌గా గోపీచంద్



గోపీచంద్

**భీమునిపట్నం, ఆగస్టు 13:** భీమిలి సబ్ రిజిస్ట్రార్‌గా మంగళవారం ఎం.గోపీచంద్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సబ్ రిజిస్ట్రార్ వి.తులసీదాసును ప్రభుత్వం పద్మనాభం మండలం బి.తాళ్లవలస ఇనాం భూముల వ్యవహారంలో సోమవారం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈమేరకు నగరంలోని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ డిపార్టుమెంట్ డీఐజీ కార్యాలయంలో ఎంవీఅండ్ ఆడిట్ విభాగంలో సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న మువ్వగోపీచంద్‌ను భీమిలికి బదిలీ చేశారు. ఉదయం ఆయన స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని చేరుకుని బాధ్యతలు స్వీకరించారు. సిబ్బంది స్వాగతం పలికారు.

## ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి: డీఈవో



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

**కొమ్మాది, ఆగస్టు 13:** ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని డీఈవో చంద్రకళ అన్నారు. మంగళవారం పీఎం పాలెం లక్ష్మీవానిపాలెం ప్రాథమిక పాఠశాలలను ఆమె ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనాలను పరిశీలించి పలు సూచనలందించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎంఈవో రవీంద్రబాబు, హెచ్ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్ల నిర్వహణకు రూ.లక్ష విరాళం



జోనల్ కార్యాలయం సూపరింటెండెంట్ శ్రీనివాసరావుకు చెక్ అందజేస్తున్న రాజు

**భీమునిపట్నం, ఆగస్టు 13:** రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆకలి తీర్చడానికి పునః ప్రారంభిస్తున్న అన్న క్యాంటీన్ల నిర్వహణకు మండలంలోని తాళ్లవలస గ్రామానికి చెందిన దాట్ల సూర్య అప్పలరాజు రూ.లక్ష విరాళాన్ని అందించారు. మంగళవారం జీవీఎంసీ భీమిలి జోనల్ కార్యాలయం సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావుకు ఈ డీడీని అందించారు. ఈ సందర్భంగా, అప్పలరాజు మాట్లాడుతూ, తన భార్య దాట్ల అమ్మాజమ్మ జ్ఞాపకార్థం ఈ విరాళాన్ని అందిస్తున్నానని తెలిపారు. భీమిలి జోన్‌లోని అన్నక్యాంటీన్ల నిర్వహణలో ఈ సొమ్ము వినియోగించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు డీఏఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## పూడికల తొలగింపు



16వ వార్డులో గెడ్డలను శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

**వెంకోజీపాలెం, ఆగస్టు 13:** స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా జోన్-3లోని గెడ్డల్లో పూడికల ను తొలగించారు. 16వ వార్డులోని పాత వెంకోజీపాలెంలో ప్రధాన గెడ్డలతోపాటు, వీధుల్లో కాలువలను పారిశుధ్య కార్మికులు శుభ్రం చేశారు. గెడ్డలో పేరుకుపోయిన మొక్కలను తొలగించారు. ప్రతి ఒక్కరూ చెత్తను పారిశుధ్య కార్మికులకు అందించాలని వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూచించారు. కాలువలలోనూ, గెడ్డలలోనూ చెత్తను పడేయడంతో దోమలు వ్యాపించి, అనేక రోగాలు వస్తాయని హెచ్చరించారు. ఈ కార్య క్రమంలో మేస్త్రీ నమ్మి చిన్నరాజు, జి.బాబు ఉన్నారు.

## దేశ నాయకులు స్ఫూర్తి ప్రదాతలు



అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

**పెదవాల్తేరు, ఆ గస్టు 13:** బీజేపీ నాయకులు మంగళవారం బీచ్ రోడ్డు పార్కు హోటల్ వద్ద మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. బీజేపీ తూర్పు నియోజక వర్గం కన్వీనర్ ఎస్ఆర్ఎల్ఎన్ మురళీమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథులుగా ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశీవిశ్వనాథ్, విశాఖపట్నం పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమ అమరవీరుల త్యాగాలను స్ఫూర్తితో తీసుకోవాలన్నారు. దేశ భక్తితో మెలగాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలకు మరమ్మతులుచేపట్టి రంగులు వేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జె. దామోదర్ యాదవ్, పార్వతీపురం జిల్లా ఇన్ చార్జి ఎస్‌వీఎస్ ప్రకాష్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ధోని నాగరాజు పాల్గొన్నారు.

## నేత్రపర్వంగా అప్పన్న నిత్య కల్యాణం



కల్యాణం చేస్తున్న వైదికులు

**సింహాచలం, ఆగస్టు 13:** వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్యకల్యా ణం నేత్రపర్వంగా సాగింది. దానిలో భాగంగా మంగళవారం వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రభాతారాధనలు నిర్వహించారు. ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడ శోపచారాలు సమర్పించారు. శాస్త్రోక్తంగా కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణలు చేసి మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చారణలు నడుమ జీలకర్రా బెల్లం, మాంగళ్య ధారణలు కావించారు. అక్షితారోపణ వేడుక తరువాత మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చి భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

## వైభవంగా సింహగిరి గ్రామ దేవతల పండగ

**సింహాచలం, ఆగస్టు 13:** వరాహలక్ష్మీనృసింహస్వామి సోదరీమణులు ఉమామహేశ్వరీ పాదాలమ్మ, పుట్ట బంగారమ్మ వార్షిక మహోత్సవాలు మంగళవారం వైభవంగా నిర్వహించారు పూజారి వంశీయులు గణపతిపూజ, పుణ్యాహవచనాలు చేసి పవిత్ర జలాలతో ఆలయాలను సంప్రోక్షణ చేశారు. ప్రత్యేక కుంకుమార్చనలు చేశారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. విజయనగరానికి చెందిన కళాకారులు పులివేషాలు, స్థానికులు వివిధ వేషధారణలతో అలరించారు. పండగ నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం 2.30కు అప్పన్నస్వామి దర్శనాలను నిలిపివేశారు. రాత్రి ఏడుగంటల నుంచి అమ్మవారి అనుపు మహోత్సవాన్ని జరిపారు. పూజారి అమ్మవారి గరగలను శిరస్సున దాల్చి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఈవో శ్రీనివాసమూర్తి, ఏఈఓ ఆనందకుమార్, పర్యవేక్షణాధికారి శ్రీనివాసరావు అమ్మవార్లకు దేవస్థానం తరపున నూతన వస్త్రాలను అందజేశారు. సింహగిరి వర్కర్స్ సంఘం ప్రసాదం పంపిణీ చేసింది.

## న్యాయ వ్యవస్థపై అవగాహన అవసరం

**డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వెంకట శేషమ్మ**



మాట్లాడుతున్న జడ్జి వెంకట శేషమ్మ

**ఆనందపురం, ఆగస్టు 13:** న్యాయ వ్యవస్థపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకట శేషమ్మ అన్నారు. మండలంలోని దబ్బంద గ్రామంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ హక్కులు ఉంటాయని వాటిని పరిరక్షించుకోవాలన్నారు. ఈ సందర్భంగా మానవ హక్కులు, న్యాయ సమస్యలపై అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆమె రోగులకు మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ శ్యాంప్రసాద్, ఎస్సై సంతోష్, సర్పంచ్ మల్లికార్జునరావు, వైద్యాధికారి గంగునాయుడు పాల్గొన్నారు.

## ప్రత్యేక అవసరాల పిల్లలకు వసతులు కల్పించాలి

**పద్మనాభం:** ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు విద్యావసతుల కల్పనలో అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎం. వెంకట శేషమ్మ చెప్పారు. పద్మనాభంలోని భవిత విద్యా కేంద్రాన్ని మంగళవారం సందర్శించిన ఆమె మాట్లాడుతూ సహిత విద్యను పొందే దివ్యాంగుల పట్ల ప్రత్యేక దృష్టి సారించి నాణ్యమైన విద్యను అందించాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, మౌలిక వసతులపై విద్యార్థుల తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పద్మనాభంలోని కస్తూరిబాగాంధీ బాలికల ఆవాస విద్యాలయాన్ని సందర్శించారు. వసతులు పరిశీలించారు. విద్యార్థులు ప్రదర్శించిన జలదీప్‌ను తిలకించారు. ఈ కార్యక్రమంలో సహిత విద్య జిల్లా కోఆర్డినేటరు గీత, ఎంఈఓ బాబూలాల్, ప్రత్యేక ఉపాధ్యాయులు రాజ్‌కుమార్, శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీ, సీఆర్పీ బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పీఏసీఎస్‌ల్లో కంప్యూటరీకరణ వేగవంతం చేయాలి

**భీమునిపట్నం, ఆగస్టు 13:** ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో కంప్యూటరీకరణ పూర్తి చేయాలని భీమిలి డివిజనల్ లెవల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బి.లక్ష్మీపతి కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఆయన సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీలు, కో ఆపరేటివ్ సిబ్బందితో సమావేశమయ్యారు. జిల్లాలో చాలా మేరకు పీఏసీఎస్‌ల్లో కంప్యూటరీకరణ పూర్తయిందన్నారు. భవిష్యత్తులో అన్ని పీఏసీఎస్‌ల్లో కార్యకలాపాలన్నీ ఆన్‌లైన్‌లోనే జరుగుతాయన్నారు. ఆనందపురం, బాందేవపురం, గంధవరం, మజ్జివలస, పద్మనాభం, పాండ్రంగి, రెడ్డిపల్లి, తగరపువలస, వేములవలస, శొంఠ్యాం, పెందుర్తి, మధురవాడ, కొత్తపాలెం సంఘాల్లో ఇంకా కంప్యూటరీకరణ చేయాల్సి ఉందన్నారు. వీటిని త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. పీఏసీఎస్‌ల్లో మొత్తం సభ్యుల ఆధార్‌కార్డులతో సహా అన్ని వివరాలను ఆన్‌లైన్ చేయాలన్నారు. ఈ సమావేశంలో భీమిలి ఎంపీడీవో జానకి, కో ఆపరేటివ్ సబ్‌రిజిస్ట్రార్ రేఖా జ్యోతిర్మయి, విశాఖ డీసీసీబీసీ డిప్యూటీ జీఎం అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

## గేటు ఏర్పాటుపై నిరసన



నిరసన తెలుపుతున్న అపార్ట్‌మెంట్ వాసులు

**ఎండాడ, ఆగస్టు 13:** ఎండాడలో ఉన్న పనోరమ హిల్స్ కాంపౌడ్ విల్లాస్‌లో ఉంటున్న వారు మధ్యలో గేట్ అమర్చడంతో అదే ప్రాంగణంలో నివసిస్తున్న సెలబ్రిటీ టవర్స్ పారామౌంట్ అపార్ట్‌మెంట్ వాసులు తొలగించాలని మంగళవారం నిరసన తెలిపారు. ప్రాంగణంలో ఉన్న వారందరూ సెక్యూరిటీకి మెయింటెనెన్స్ ఇస్తున్నామని, ప్రాంగణమంతా ఒకే బిల్డర్ ఆధ్వర్యంలో ఉన్నప్పుడు మధ్యలో గేట్ ఎలా పెడతారని ప్రశ్నిస్తూ ఉదయం నుంచి ప్రాంగణంలో ధర్నా చేశారు. గతంలో ఇదే సమస్య తలెత్తితే గేట్‌లను పూర్తిగా తొలగించామని, మళ్లీ వాటిని ఎలా అమరుస్తారంటూ ఆందోళన చేపట్టారు. సాయంత్రం నిర్మాణ సంస్థకు సంబంధించిన సీవోవో (చీఫ్ ఆర్గనైజేషన్ ఆఫీసర్) వచ్చి సమస్యను పరిష్కరిస్తానని, ప్రస్తుతం మధ్యలో గేట్‌ని తొలగిస్తామని ప్రకటించారు.